ANN తెలుగు
Follow: @ANNTELUGU
04-08-2026
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 212 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



# కర్ణాటక కేబినెట్ విస్తరణ పూర్తి
## .. రాజీనామాల రగడ



**బెంగళూరు, మహా :** కర్ణాటక ముఖ్య మంత్రి డీ.కే. శివకుమార్ నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మంత్రివర్గ విస్తరణ కొందరిలో విపరీతమైన ఆనందోత్సాహానికి, మరికొందరిలో తీవ్ర ఆగ్రహావేశాల కు కారణమైంది. ఏకంగా 20 మంది కొత్త మంత్రుల ప్రమాణస్వీకారంతో ఒకవైపు పండుగ వాతావరణం సంతరించుకోగా, మరోవైపు తీవ్ర అసమ్మతి, ధర్నాలు, ఆందోళనలకు దారితీసింది. కేబినెట్ లో చోటు దక్క కపోవడంతో అసమ్మతి నేతలు బహి రంగంగానే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పదవి దక్కకపో వడంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఎమ్మెల్యే యశ్వంతరాయ గౌడ పాటిల్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీ నాయకత్వం మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## మిస్టర్ డ్రామారావు


- కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్
- పెద్ది మరణంతో బీఆర్ఎస్ రాజకీయం

02

## పెద్దిపై ఒత్తిడి


- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అక్రమకేసులతో ఇబ్బందిపెట్టారు

02

## జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి


- ప్రధాని వీడియో తొలగింపుపై పార్లమెంటరీ కమిటీ ఆగ్రహం
- సాంకేతిక లోపమంటూ మెటా వివరణ.. క్షమాపణ సరిపోదన్న సభ్యులు.

02



## సుప్రీంకోర్టులో జడ్జిల పెంపు
- 38 మందికి లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్.

02



## భారతదేశ అగ్రగామి ఆర్థిక శక్తుల్లో తెలంగాణ రాష్ట్రం
- వెల్లడించిన ఆర్బీఐ నివేదిక

02

## ఉదయనిధి సభలో 'త్రిష' నినాదాలు
- విజయ్ కు ఉన్న ఒక్క టెన్షన్.. అంటూ
- ఉదయనిధి వ్యాఖ్యలపై మహిళా సంఘాల తీవ్ర ఆగ్రహం
- విపక్షాల విమర్శలతో మరింత పెరిగిన రాజకీయ వేడి



02



# సింగరేణికి పీకే ఓసీ-2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్
## తెలంగాణకు శుభపరిణామమన్న కేంద్రం



- మణుగూరుకు వరం.. మరో 25 ఏండ్లు డోన్ట్ వర్రీ
- ఈ ప్రాజెక్టుతో సింగరేణికి రూ.43వేల కోట్ల ఆదాయం
- 2వేల మందికి ఉపాధి లభిస్తుందన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- వేలంలో పీకేఓసీ-2 దక్కడం చారిత్రాత్మక విజయం: భట్టి విక్రమార్క
- ఓసి-2 డిప్ సైడ్ కోసం మంత్రులపై ఒత్తిడి తెచ్చిన ఎమ్మెల్యే పాయంవెంకటేశ్వర్లు

**హైదరాబాద్, మహా :** మణుగూరు ప్రజల పోరాటానికి విజయం దక్కింది. 25 ఏండ్ల భవిష్యత్తు, అపార బొగ్గు నిక్షేపాలు కలిగిన పికెఓసి2 డిప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ ప్రాజెక్టు గనులను సింగరేణి యాజమాన్యం కేంద్రం నిర్వహించిన వేలంలో దక్కించుకుంది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా హర్షం వ్యక్తమైంది. మణుగూరు పట్టణ ఫ్యూచర్ పై గత కొంతకాలంగా నెలకొన్న ఆందోళన.. ఈ ప్రాజెక్టుతో మిగతా 2వ పేజీలో



# బీజేపీకి జెన్ జీ దెబ్బ
## బిహార్ బంకీపూర్ లో కమలం చిత్తు

- బిజెపి జాతీయ అధ్యక్షుడు ఖాళీచేసిన సీటులో ప్రశాంత్ కిషోర్ విక్టరీ
- బోణీ కొట్టిన జన్ సురాజ్
- మధ్యప్రదేశ్ లో మరో కంచుకోట కోల్పోయిన బిజెపి
- దతియాలో బిజెపిపై కాంగ్రెస్ ఘనవిజయం
- అధికారంలో ఉన్న రాష్ట్రాల బైపోల్స్ లో.. ఓటమి షాక్ లు
- మూడింటిలో.. రెండు కోల్పోయిన బిజెపి.. గుజరాత్ లో దక్కిన పరువు
- 30 ఏండ్ల ఆధిపత్యం 30రోజుల్లో కూలింది : ప్రశాంత్ కిశోర్

**ఢిల్లీ, మహా :** బీజేపీకి వరుస దెబ్బలు తగులుతున్నాయి. నీట్ యూజీ ప్రశ్నపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనలతో గతవారం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయగా.. ఈ వారం రెండు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పరాజయాలతో ప్రారంభమైంది. బీజేపీ అధికారంలో ఉన్న రెండు రాష్ట్రాల్లోని జరిగిన ఉపఎన్నికల్లో ఆ పార్టీ ఓటమి చవిచూసింది. బిహార్‌లో పార్టీ అధినేత నితిన్ నబిన్ రాజీనామా చేసిన బంకీపూర్‌తో పాటు మధ్యప్రదేశ్‌లోని దతియా స్థానాలను కోల్పోయింది. సాధారణంగా ఉప ఎన్నికల్లో అధికార పార్టీలకు విజయావకాశాలు ఉంటాయి. ఇది గుజరాత్‌లోని మంజల్‌పూర్ అసెంబ్లీ స్థానంలో జరిగింది. ఆ స్థానాన్ని బీజేపీ భారీ మెజారిటీతో గెలుచుకుంది. ఈ నేపథ్యంలో చూస్తే బంకిపూర్, దతియాలో ఎదురైన ఓటములు మాత్రం ఆ పార్టీని తీవ్రంగా కలవరపెడుతోంది. బంకిపూర్‌లో ఓటమి మరీ దారుణం. గత ఎన్నికల్లో బీజేపీ 50వేల ఓట్లకు పైగా మెజారిటీతో ఈ స్థానాన్ని చేజిక్కించుకోగా, ఇపుడు 20వేల ఓట్ల తేడాతో కోల్పోయింది. అప్పుడు 64 శాతం ఓట్లు రాగా.. ప్రస్తుతం 34 శాతానికి పడిపోయింది. ఇది ఏకంగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఖాళీచేసిన సీటు.. మిగతా 2వ పేజీలో

## విలువల రాజ్యం భారత్ పతనమవుతున్న పాశ్చాత్య లోకం
- ది డైలీ స్టార్ 'ఫేస్ ఆఫ్ గ్లోబల్ సెక్స్' సర్వేలో అబ్బురపరిచే నిజాలు.
- తొలి శృంగార అనుభవంలో భారతీయ యువతలో అత్యున్నత నిగ్రహం.
- 22.9 ఏళ్ల సగటు వయసుతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన యువశక్తి.




02

## సహజీవనంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- భాగస్వామిపై క్రిమినల్ కేసులకు గ్రీన్‌సిగ్నల్
- పెళ్లి లేకున్నా చట్టపరమైన రక్షణ తప్పదు
- వేధింపుల నుంచి తప్పించుకోలేరన్న ధర్మాసనం



02








## మిస్టర్ డ్రామారావు

- కేటీఆర్ పై మంత్రి పొంగులేటి ఫైర్
- పెద్ది మరణంతో బీఆర్ఎస్ రాజకీయం

**హైదరాబాద్, మహా :** దివంగత ఉద్యమ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మరణాన్ని కేటీఆర్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం 'ఎక్స్' వేదికగా తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవించి ఉన్నప్పుడు ఆయన్ని విస్మరించి, ఇప్పుడు ఆయన మరణంపై రాజకీయం చేస్తున్న 'మిస్టర్ డ్రామారావు' కేటీఆర్ అంటూ పొంగులేటి మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఉద్యమకారుడైన పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించిందని పొంగులేటి ఆరోపించారు. ఎమ్మెల్యేగా ఓటమి పాలైన తర్వాత ఆయనకు కనీసం రాజ్యసభ లేదా ఎమ్మెల్సీ పదవి అయినా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. సంతోష్ రావు, దామోదర్ రావు వంటి వారికి పదవులు కట్టబెట్టిన బీఆర్ఎస్ నాయకత్వం, పెద్ది సుదర్శన్ రెడ్డిని ఎందుకు విస్మరించిందని ఆయన ప్రశ్నించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ది సుదర్శన్ రెడ్డిని వైద్య చికిత్స కోసం వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసిందని, ఆయన అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించిందని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గుర్తుచేశారు. ఉద్యమకారులను కేవలం ఓట్ల కోసం వాడుకుని, అధికారం, కీలక పదవులన్నీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటున్న బీఆర్ఎస్ పార్టీకి రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయమని పొంగులేటి ధ్వజమెత్తారు.



## పెద్దిపై ఒత్తిడి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్, మహా :** పెద్ది సుదర్శన్ రెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రస్థాయిలో రాజకీయ ఒత్తిడి తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని పెద్ది నా దగ్గరకు వచ్చి చెప్పారు. విద్యాశాఖలో జరిగిన అవినీతిపై ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన చనిపోయిన మరుసటి రోజే ఆ కేసులో సుప్రీంకోర్టు కాంగ్రెస్ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చిందని కేటీఆర్ వెల్లడించారు.

## జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి

**ప్రధాని వీడియో తొలగింపుపై పార్లమెంటరీ కమిటీ ఆగ్రహం**

**ఢిల్లీ, మహా :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ వీడియోను తాత్కాలికంగా బ్లాక్ చేసిన ఘటన గురించి మెటా ప్రతినిధులు సోమవారం పార్లమెంటరీ స్థాయి కమిటీ ముందు వివరణ ఇచ్చారు. మెటా ఈ ఘటనను సాంకేతిక లోపంగా పేర్కొంటూ క్షమాపణ చెప్పినా, అది మాత్రమే సరిపోదని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ఇలాంటి తప్పిదాలు మళ్లీ జరగకుండా తీసుకునే చర్యలపై వివరాలు కోరారు.పార్లమెంటరీ స్థాయి సమాచార సాంకేతిక కమిటీ ఛైర్మన్ నిషికాంత్ దూబే మాట్లాడుతూ.. 'ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వీడియోను తొలగించినందుకు మెటా అధిపతి మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణ చెప్పాలి' అన్నారు. సోషల్ మీడియా సంస్థలు భారత చట్టాలను, ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవిస్తూ మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. తమ ప్లాట్‌ఫామ్‌లలో బాలల లైంగిక వేధింపుల కంటెంట్‌పై కూడా మెటా అధికారులు కఠినమైన ప్రశ్నలను ఎదుర్కొన్నట్టు తెలుస్తోంది

# సింగరేణికి పీకే ఓసీ-2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్

( మొదటి పేజీ తరువాయి )

తొలగిపోగా, ప్రాజెక్టు కోసం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై, రాష్ట్రమంత్రులపై తెచ్చిన ఒత్తిడి ఫలించింది. భట్టి విక్రమార్క స్వయంగా పికె ఓసి2 గనిని సందర్శించగా, ఇక్కడి పరిస్థితిపై.. భవిష్యత్తుపై స్పష్టమైన భరోసా ఇచ్చారు. వేలంలో వ్యూహాత్మకంగా సింగరేణిదే పైచేయి అయ్యేలా చేయడంలో సక్సెస్ అయ్యారు. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి పెరగడానికి మణుగూరు ప్రజలు చేసిన ఆందోళనలు కీలకంగా పనిచేశాయి. మొత్తంగా సింగరేణి ప్రాంతంలో భారీ నిల్వలున్న అతి పెద్ద గని సింగరేణికి దక్కడంతో కంపెనీ మనుగడకు, బొగ్గు ఉత్పత్తికి కూడా ఇది దోహదం చేయనుంది.

**పీకేఓసీ-2 దక్కడం చారిత్రాత్మక విజయం: భట్టి విక్రమార్క**

మణుగూరు పీకేఓసీ2 డిప్‌సైడ్ బ్లాక్ వేలంలో సింగరేణికి దక్కడం చారిత్రాత్మక విజయమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన ఈ కేటాయింపుపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వ కృషితోనే నెల రోజుల వ్యవధిలో తాడిచర్ల2, పీకేఓసీ 2 రూపంలో సింగరేణికి రెండు పెద్ద ప్రాజెక్టులు సొంతమయ్యాయని తెలిపారు. పీకేఓసీ2 మైన్ ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల చొప్పున 20 ఏళ్ల పాటు 120 మిలియన్ టన్నుల జీ8 నాణ్యమైన బొగ్గు అందుబాటులోకి వస్తుందని, దాదాపు 2,000 మందికి దీర్ఘకాలిక ఉపాధి భద్రతతో పాటు మణుగూరు ఏరియా మనుగడకు 20 ఏళ్ల భరోసా లభిస్తుందని వివరించారు. గతంలో ప్రైవేటు పరమైన కోయగూడెం3, సత్తుపల్లి3 బ్లాక్‌లను కూడా భవిష్యత్తులో సింగరేణికి దక్కేలా ప్రభుత్వం కృషి చేస్తుందని, రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లో బొగ్గు గనులు, క్రిటికల్ మినరల్స్ అన్వేషణ దిశగా సింగరేణిని విస్తరింపజేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో సింగరేణి ప్రయోజనాల పరిరక్షణలో తగిన చొరవ చూపకపోవడం వల్ల కోయగూడెం3 మరియు సత్తుపల్లి-3 వంటి కీలక బొగ్గు బ్లాక్‌లు ప్రైవేట్ సంస్థలకు వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. ప్రజా ప్రభుత్వం మాత్రం సింగరేణి ప్రయోజనాలనే కేంద్రబిందువుగా తీసుకుని ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటోందని స్పష్టం చేశారు. సీఎం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో సింగరేణి సంస్థను మరింత బలోపేతం చేయడం, కొత్త బొగ్గు నిల్వలను సంస్థకు అందించడం, ఉద్యోగ భద్రతను పెంపొందించడం, తెలంగాణ విద్యుత్ అవసరాలకు దీర్ఘకాలికంగా బొగ్గు సరఫరా భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

**తెలంగాణకు శుభపరిణామం - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



సింగరేణి సంస్థకు పీకే ఓసీ2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్ కేటాయించడం తెలంగాణకు ఎంతో శుభ పరిణామమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, అధికారులు, తెలంగాణ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి.. ఈ బ్లాక్ ద్వారా సింగరేణి భవిష్యత్‌కు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. పీకేఓసి2 డిప్‌సైడ్ కోల్ బ్లాక్‌లో సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు.దీంతో ప్రతి ఏడాది 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి కొనసాగించవచ్చని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 2 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు. ఈ బ్లాక్‌లో లభించే జీ8 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు కారణంగా మొత్తం రూ.43 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.10,500 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుందని తెలిపారు. దీంతో తెలంగాణ ఇంధన భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు సింగరేణి అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతాయని చెప్పారు.

# సుప్రీంకోర్టులో జడ్జిల పెంపు

**38 మందికి లోక్‌సభ గ్రీన్‌సిగ్నల్.**



**ఢిల్లీ, మహా :** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే కీలక బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి ఉన్న మొత్తం 34 మంది న్యాయమూర్తుల సంఖ్యను 38కు పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026ను విపక్షాల నిరసనల మధ్య ఎలాంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. దీంతో ఈ ఏడాది మే నెలలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత కల్పించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. లోక్‌సభ సమావేశం ప్రారంభమైనప్పటి నుంచే నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ, అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాల చోరీ ఆరోపణలు, విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జ్ వంటి అంశాలపై కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నినాదాలతో సభా కార్యక్రమాలను అడ్డుకున్నారు. పలుమార్లు సభ వాయిదా పడిన అనంతరం తిరిగి ప్రారంభమైనప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లును సభలో ప్రవేశపెట్టి దాని ఉద్దేశాన్ని వివరించారు. బిల్లుపై చర్చలో పాల్గొనాలని, సభా సంప్రదాయాలను గౌరవించాలని స్పీకర్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా విపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించారు. దీంతో బిల్లును మూజువాణి ఓటుకు పెట్టగా సభ ఆమోదించింది. అలాగే కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ విపక్షం ప్రవేశపెట్టిన చట్టబద్ధ తీర్మానాన్ని కూడా సభ తిరస్కరించింది. ఈ సవరణతో ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల అనుమతించిన సంఖ్య 33 నుంచి 37కు పెరగనుంది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం సంఖ్య 38కు చేరుతుంది. సుప్రీంకోర్టులో పెరుగుతున్న పెండింగ్ కేసులు, న్యాయమూర్తులపై అధిక పనిభారం తగ్గించడం, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇదిలా ఉండగా, భారతీయ గణాంక సంస్థ (ఐఎస్ఐ)కు సమగ్ర చట్టపరమైన వ్యవస్థను కల్పించే భారతీయ గణాంక సంస్థ బిల్లు-2026ను కూడా కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కొత్త చట్టం ప్రకారం భారత రాష్ట్రపతి ఐఎస్ఐకి విజిటర్‌గా వ్యవహరించనుండగా, సంస్థ నిర్వహణ కోసం ఛైర్మన్ నేతృత్వంలో బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఏర్పాటు చేయనున్నారు. విద్య, పరిశోధన, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, పరిమాణాత్మక ఆర్థిక శాస్త్రం వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో సంస్థను మరింత బలోపేతం చేయడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.

## నీట్ ఆందోళన

- విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్ లను ఉపసంహరించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉంది
- తీవ్రమైన నేర చరిత్ర లేకపోతే కేసులను ఉపసంహరించుకోవచ్చన్న సుప్రీంకోర్టు





**న్యూఢిల్లీ, మహా :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనల సందర్భంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లపై సోమవారం సుప్రీంకోర్టు స్పష్టతనిచ్చింది. విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు ఉపసంహరించుకునే స్వేచ్ఛ రాష్ట్రాలకు ఉందని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహన్ లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారణ చేసింది. 'నేర చరిత్ర' అనే పదం కేవలం తీవ్రమైన, హేయమైన నేరాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది. అందువల్ల నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులకు గతంలో తీవ్రమైన, హేయమైన నేర చరిత్ర లేనట్లయితే, వారిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను దిల్లీ సహా ఇతర రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వాలు మూసివేయవచ్చని, లేదా ఉపసంహరించుకోవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

విచారణ ప్రారంభంలో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ, "నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను కొనసాగించకూడదనే విషయంలో కేంద్రం పూర్తి నిబద్ధతతో ఉంది. అయితే తీవ్రమైన, హేయమైన నేర చరిత్ర ఉన్న 2,700 మందికిపైగా వ్యక్తులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేది లేదు" అని అన్నారు. మరోవైపు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ తన వాదనలు వినిపిస్తూ, నిరసనల సమయంలో న్యాయవాదుల పిల్లలను కూడా పోలీసులు కొట్టారన్నారు. "ఆ వీడియోలు చాలా దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. మేము కోర్టుకు 300 వీడియోలను ఇచ్చాం. ఉన్నతాధికాల నుంచి ఆదేశాలు వచ్చినందున, పోలీస్ కమిషనర్ వీటన్నింటినీ పరిశీలించాలి. విద్యార్థులపై దురాగతాలకు పాల్పడిన యూనిఫామ్ లేని వ్యక్తులను మేము గుర్తించాం. పోలీసులు పెల్లెట్ గన్‌లు మొదలైనవి ఎందుకు ఉపయోగించారనే దానిపై పోలీస్ కమిషనర్, ఆర్ఏఎఫ్ డైరెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వాలి" అని న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, కేవలం ఆందోళన జరుగుతుందనే కారణంతో పోలీసుల దురాగతాలను లేదా లాఠీ ఛార్జిని సమర్థించలేమని స్పష్టం చేసింది. శాంతియుత నిరసన తెలిపే హక్కు అందరికీ సంపూర్ణంగా ఉంటుందని నొక్కి చెప్పింది. తదుపరి విచారణను ఆగస్టు 18కి వాయిదా వేసింది.




# కర్ణాటక కేబినెట్ విస్తరణ పూర్తి

( మొదటి పేజీ తరువాయి )



నన్ను తీవ్రంగా గాయపరిచింది. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను' అని ఆయన పేర్కొన్నారు. 'మన వద్ద చాలామంది సమర్థులైన ఎమ్మెల్యేలు ఉన్నారు. అయితే అందరినీ ఒకేసారి కేబినెట్‌లోకి తీసుకోవడం సాధ్యపడదు. గతంలో సిద్ధరామయ్య మంత్రివర్గంలో నాకు కూడా అవకాశం దక్కలేదు. కానీ ఆ తర్వాత నేను మంత్రిని అయ్యాను కదా? అదే రీతిలో ఇప్పుడు పదవులు రాని వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తాం. అందరూ ఓపికగా ఉండాలని కోరుతున్నాను' అని సీఎం శివకుమార్ విజ్ఞప్తి చేశారు.

**20 మంది నూతన మంత్రులు**

కాంగ్రెస్ అధిష్టానం ఆమోదంతో ముఖ్యమంత్రి డీ.కే. శివకుమార్ తన కేబినెట్‌లోకి 20 మంది నేతలను చేర్చుకున్నారు. ఇందులో 12 మంది కొత్త ముఖాలకు అవకాశం దక్కగా, 8 మంది మునుపటి మంత్రులను తిరిగి కొనసాగించారు. ఈ జాబితాలో గాయత్రి శాంతెగౌడ ఏకైక మహిళా మంత్రిగా చోటు దక్కించుకున్నారు.

# బీజేపీకి జెన్ జీ దెబ్బ

( మొదటి పజీ తరువాయి )

30 ఏండ్ల కంచుకోట కావడం విశేషం. బిజెపి జాతీయ అధ్యక్షుడికి ఇది తలెత్తుకోలేని ఫలితమే.

**పీకే సంచలన విజయం**

ప్రముఖ రాజకీయ వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ (పీకే) ప్రత్యక్ష రాజకీయాల్లో సంచలన విజయాన్ని నమోదు చేశారు. బీహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఆయన ఘన విజయం సాధించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో, ఆ పార్టీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై సుమారు 19,324 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సోమవారం జరిగిన ఓట్ల లెక్కింపులో మొత్తం 32 రౌండ్ల ముగిసేసరికి ప్రశాంత్ కిశోర్‌కు 64,151 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్‌కు 44,827 ఓట్లు పోలయ్యాయి. ఇక ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారి 14,273 ఓట్లతో మూడో స్థానానికే పరిమితమయ్యారు. ఈ విజయంతో ప్రశాంత్ కిశోర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీకి సైతం ఇదే తొలి ఎన్నికల విజయం కావడం విశేషం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో బంకీపూర్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. 1995 నుంచి (గతంలో పట్నా పశ్చిమ స్థానంగా పిలిచేవారు) ఈ నియోజకవర్గం బీజేపీకి తిరుగులేని కోటగా ఉంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జన సురాజ్ పార్టీ అనేక స్థానాల్లో పోటీ చేసినప్పటికీ ఒక్క చోట కూడా విజయం సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో పీకే సాధించిన విజయం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ ఫలితంపై బీహార్ ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, మంత్రి విజయ్ కుమార్ సిన్హా స్పందిస్తూ, ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రశాంత్ కిశోర్‌కు అభినందనలు తెలియజేశారు.

**30 ఏళ్ల ఆధిపత్యం 30 రోజుల్లోనే కూలింది: ప్రశాంత్ కిశోర్**

30 ఏళ్ల ఆధిపత్యం 30 రోజుల్లోనే కూలిపోయిందని జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ అన్నారు. బిహార్‌లోని బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నిక ఓట్ల లెక్కింపులో విజయం సాధించిన అనంతరం ప్రశాంత్ కిశోర్ మాట్లాడారు. బిహార్ నుంచి లక్షల మంది వలసలు పోతున్నారని, ఎన్డీయే పాలనలో రాష్ట్రానికి ఎలాంటి మేలు జరగలేదు అని విమర్శించారు. వారి పాలనలో గుజరాత్ మాత్రమే అభివృద్ధి చెందిందని అన్నారు. తనను ఓడించేందుకు బంకీపూర్ లో బీహార్ సీఎం, బీజేపీ జాతీయ అధ్యక్షుడు, 27 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎంపీలు, కేంద్ర మంత్రులు ప్రచారం చేశారని, బోజ్‌పురి సినీ తారలు, మోదీ మీడియా తనకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని, అయినా బంకీపూర్ ఉప ఎన్నికలో బీజేపీ భారీ ఓట్ల తేడాతో ఓడిపోవడం ఆ పార్టీ చెంపపెట్టు అని..ఇది ప్రజాస్వామ్య విజయం అని ప్రశాంత్ కిశోర్ తెలిపారు.

## ఉదయనిధి సభలో 'త్రిష' నినాదాలు

**విజయ్ కు ఉన్న ఒక్క టెన్షన్.. అంటూ**



**చెన్నై, మహా :** కావేరి జలాల సమస్యపై డీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఈ ధర్నాలో డీఎంకే నేత, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి స్టాలిన్ ప్రసంగిస్తూ రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు ఉన్న ఏకైక టెన్షన్ అంటూ ఉదయనిధి వ్యాఖ్యలు చేస్తుండగా, సభలో కొంతమంది డీఎంకే కార్యకర్తలు ఒక్కసారిగా 'త్రిష.. త్రిష..' అంటూ నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో సమావేశ ప్రాంగణంలో కొద్దిసేపు సందడి నెలకొంది. ఉదయనిధి ప్రసంగం కొనసాగుతుండగానే కార్యకర్తల నినాదాలు వినిపించడంతో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. ఉదయనిధి స్టాలిన్ పై మహిళాసంఘాలు, విపక్షపార్టీలు మండిపడుతున్నాయి.

## భారతదేశ అగ్రగామి ఆర్థిక శక్తుల్లో

# తెలంగాణ రాష్ట్రం

**హైదరాబాద్: మహా :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్.బి.ఐ) విడుదల చేసిన 'హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ది ఇండియన్ ఎకానమీ 202526' ప్రకారం, భారతదేశంలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలలో తెలంగాణ ఒకటిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. తాజా గణాంకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరమైన విస్తరణను, ముఖ్యంగా తలసరి ఆదాయంలో రెండంకెల పెరుగుదలను స్పష్టం చేస్తున్నాయి.ఈ గణాంకాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పురోగతిని వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత ధరల వద్ద తెలంగాణ నికర రాష్ట్ర దేశీయోత్పత్తి (ఎన్.ఎస్.డి.పి) 202425లో ఉన్న రూ. 14.57 లక్షల కోట్ల నుండి 202526 నాటికి రూ. 16.14 లక్షల కోట్లకు పెరిగింది. ఇది 202122లో నమోదైన రూ. 10.17 లక్షల కోట్లతో పోలిస్తే భారీ పురోగతి. మొత్తం ఆర్థిక వ్యవస్థ పరిమాణం (జి.ఎస్.డి.పి) పరంగా, మహారాష్ట్ర (రూ. 44.84 లక్షల కోట్లతో మొదటి స్థానం), తమిళనాడు మరియు కర్ణాటక వంటి రాష్ట్రాల తర్వాతి స్థానాల్లో నిలుస్తూ తెలంగాణ దేశంలో ఏడవ స్థానాన్ని ఆక్రమించింది.విశేషమేమిటంటే, రాష్ట్ర తలసరి ఆదాయం 10 శాతానికి పైగా వృద్ధి చెందింది—సుమారు రూ. 38,900 పెరిగి రూ. 4,18,931 కి చేరుకుంది. ఈ గణాంకాలతో తెలంగాణ దేశవ్యాప్తంగా కర్ణాటక (రూ. 4,33,326) తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. తమిళనాడు, గుజరాత్ మరియు మహారాష్ట్ర వంటి ప్రధాన ఆర్థిక శక్తి కేంద్రాలను సైతం విజయవంతంగా అధిగమించింది. ఆర్బీఐ గణాంకాలపై ఎ. ◌ేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. డిసెంబర్ 2023లో తమ కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత అమలు చేసిన వ్యూహాత్మక పాలనకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ "సరికొత్త క్షితిజాలను, ఉన్నత శిఖరాలను" చేరుకుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన తెలిపారు. నిర్ణయాలను అప్పటికప్పుడు తీసుకోవడానికి బదులుగా, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, అన్ని రంగాల సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిన విధానపరమైన పాలన వల్లే ఈ ఆర్థిక మైలురాళ్లను చేరుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన పరిపాలనా వైఫల్యాలను తమ ప్రభుత్వం తిప్పికొట్టి, రాష్ట్రంలో తిరిగి ఆశాభావాన్ని రేకెత్తించిందని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. తెలంగాణ సాధించిన ఈ ఆర్థిక ప్రగతికి మహిళలు, రైతులు, యువతే అతిపెద్ద లబ్ధిదారులని స్పష్టం చేసిన ఆయన, రాబోయే సంవత్సరాల్లో రాష్ట్రం మరింత గొప్ప ఆర్థిక విజయాలను చూస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.








# చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులు అరెస్ట్

- మొత్తం రూ. 25 లక్షల విలువగల 28 మోటార్ సైకిళ్ల స్వాదీనం
- ప్రతిభ కనపరిచిన సిసిఎస్, కేయూ పోలీసులు

**వరంగల్ క్రైం మహా :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీల పై సంబంధిత పోలీస్ స్టేషన్ లలో కేసులు నమోదు కాగా బైక్ చోరీలు తద్వారా చైన్ స్నాచింగ్ కేసులకు కూడా దారి తీస్తునందుకు సెంట్రల్ జోన్ డిసిపి కవిత ఆధ్వర్యంలో స్పెషల్ టీంలను నియమించారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కొద్ది కాలంగా జరిగిన నేరాలను విశ్లేషణ చేయగా, సోమవారం ఇద్దరు అనుమానితులను అదుపులోనికి తీసుకోని విచారణ చేయగా బైక్ చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా సోమవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపీఎస్ విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. దొంతుల ప్రశాంత్ కుమార్ (20), నివాసం పి.కె. రాజయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ఎన్‌టీపీసీ, మంచిర్యాల తో పాటు దుర్గం సాయి కార్తీక్ (21), నివాసం వేలాల గ్రామం, జైపూర్ మండలం, మంచిర్యాల జిల్లా. వీరు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.వాహన తనిఖీల సందర్భంగా నిందితులు ప్రయాణిస్తున్న అనుమానాస్పద పల్సర్ మోటార్ సైకిల్ నెంబర్ ఏపి 36 ఏవై 4700 గలదాన్ని పోలీస్ టీం స్వాధీనం చేసుకుని విచారించగా, వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టిన వాహనాల గురించి సమాచారం అందించారు. వారి ఇచ్చిన సమాచారం మేరకు కేయూ పోలీస్ స్టేషన్ మునిపల్లి గ్రామ శివారు ఎలుకతుర్తి సమీపంలోని ప్రాంతాల నుండి మొత్తం 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నాము. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో హోండా షైన్, హీరో స్ప్లెండర్ ప్లస్, హీరో గ్లామర్, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ పల్సర్, హోండా హార్నెట్ తదితర మోడళ్లకు చెందిన ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. అవి వరంగల్ కమీషనరేట్ లో 8, కరీంనగర్ కమీషనరేట్ లో 9, రామగుండం కమిషనరేట్ పెద్దపల్లి లో 3, సిద్ధిపేట కమీషనరేట్ లో 2 హైదరాబాద్ కమీషనరేట్ లో 3, రాచకొండ కమీషనరేట్ లో 1, భూపాలపల్లి జిల్లాలో 2 మొత్తం 28 మోటార్ సైకిళ్ళ దొంగతనాలు చేశారు. వీటికి సంబంధించిన కేసులను ఆయా పోలీస్ స్టేషన్ల తో అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నిందితుల పై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లలో ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదు అయినాయి. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించి చట్టపరమైన ప్రక్రియ అనంతరం అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నాము .ప్రజలు తమ వాహనాలను భద్రంగా పార్కింగ్ చేసి, స్టీరింగ్, వీల్ లాక్స్ వంటి అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పై వరుస వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ లు ఏ. రాఘవేందర్, ఈ. హరికృష్ణ ,కే .రామకృష్ణ , ఇన్స్పెక్టర్ రవి కుమార్ ను సిసిఎస్ ఎస్ఐ శ్రీనివాస రాజు, హెడ్ కానిస్టేబుల్స్ నసీమ్ అహ్మద్, రవిప్రసాద్, జంపయ్య, కానిస్టేబుల్లు విశ్వేశ్వర్, వంశీ, వినోద్ లను, ఐటి కోర్ టీం ఏవో ఎండి. సల్మాన్ పాషా కానిస్టేబుల్ నగేష్, కేయూసి క్రైమ్ కానిస్టేబుల్స్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత ఐపిఎస్ తో పాటు పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.ఈ సమావేశంలో హన్మకొండ, సిసిఎస్ ఏసీపీ లు నర్సింహారావు, సదయ్య పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





**వరంగల్, బ్యూరో మహా ;**వరంగల్ జిల్లాలో వన మహోత్సవం-2026 కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి, శాఖలకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా మొక్కలు నాటి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) నిఖిలతో కలిసి జిల్లా స్థాయి మానిటరింగ్ అండ్ కోఆర్డినేషన్ కమిటీ (డీఎల్ఎంసీసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా మొక్కల నాటకం, లక్ష్యాల సాధన, జియో ట్యాగింగ్ పురోగతి, మొక్కల సంరక్షణ చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.జిల్లాకు ఈ ఏడాది 25 51 248 మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 7 27 612 మొక్కలు నాటడం జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. టార్గెట్ పూర్తి చేయని అధికారులను అందుకు గల కారణాలను తెలుసుకుని నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నాటిన ప్రతి మొక్క మనుగడను నిర్ధారించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మొక్కల జియో ట్యాగింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతి మొక్కను తప్పనిసరిగా నమోదు చేయాలని, వాటి సంరక్షణపై సంబంధిత శాఖలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని శాఖలన్నీ రోజువారీ కార్యాచరణ ప్రణాళికతో సమన్వయంగా పనిచేయాలని, మిగిలిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి,డిఆర్డిఓ నాగపద్మజా, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# శిశువులకు తల్లి పాలే పౌష్టికాహారం

- తల్లి ఆరోగ్యమే శిశువు భవిష్యత్తుకు బలమైన పునాది
- హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, మహా;** శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, ఎదుగుదలకు తల్లిపాలే అత్యుత్తమ ఆహారమని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి అన్నారు. ప్రతి తల్లి తన ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, శిశువులకు సమయానుకూలంగా తల్లిపాలు అందించాలని సూచించారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం హనుమకొండ గోపాల్‌పూర్‌లోని ఎంపీపీఎస్ ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అన్నప్రాశన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు తన చేతుల మీదుగా అన్నప్రాశనం చేయించి ఆశీర్వదించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు పుట్టిన వెంటనే ముర్రుపాలు (కొలస్ట్రం) తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. ముర్రుపాలు శిశువుకు సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించే అమూల్యమైన ఆహారమని పేర్కొన్నారు. శిశువు జన్మించినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఇవ్వాలని, ఆ తరువాత ఏడో నెల నుంచి వైద్యుల సూచనల మేరకు అనుబంధ పోషకాహారం ప్రారంభించి, రెండు సంవత్సరాల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని తెలిపారు. పిల్లల తల్లులు తమ ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత పై ప్రత్యేక శ్రద్ధ వించాలని, ఆరోగ్యవంతమైన తల్లే ఆరోగ్యవంతమైన బిడ్డకు పునాది అని కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా గోపాల్‌పూర్ ఆరోగ్య కేంద్రం-1 పరిధిలోని చిన్నారులకు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ చేతుల మీదుగా అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, అంగన్‌వాడీ సూపర్వైజర్లు జ్యోతి, ఝాన్సీ, పోషణ్ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ ప్రీతి, జెండర్ స్పెషలిస్ట్ స్వర్ణలత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సమత, ఆశా కార్యకర్తలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.





# ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు ఎంజీఆర్ వినతి**

**ఖైరతాబాద్ :** ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సమస్యల పై సమరం" కార్యక్రమంలో భాగంగా గత కొన్ని రోజులుగా అన్ని డివిజన్లలో చేపట్టిన పాదయాత్రల సందర్భంగా ప్రజలు వెల్లడించిన సమస్యలను జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ద్వారా ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ మన్నె గోవర్ధన్ రెడ్డి (ఎంజీఆర్) సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.బంజారాహిల్స్ డివిజన్ ఉదయ్‌నగర్ సింగాడ బస్తీలో ప్రమాదకరంగా మారిన ప్రధాన నాలాను పునర్నిర్మించాలని, ప్రేమ్‌నగర్‌లోని సాయిబాబా కమాన్ వద్ద నాలాపై రక్షణ గ్రిల్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అలాగే వెంకటేశ్వర కాలనీ డివిజన్ రోడ్ నెం.3 నవోదయ కాలనీలో టైమ్స్ ఆఫ్ ఇండియా లైన్ పక్కనున్న దెబ్బతిన్న రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని, గతంలో ఇచ్చిన వినతిపత్రంపై స్పందన లేకపోవడంతో మరోసారి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఫిలింనగర్ డివిజన్ హనుమాన్ టెంపుల్ లేన్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి మంజూరు ఇవ్వాలని, ఖైరతాబాద్ డివిజన్ మూడు గుళ్ల ప్రాంతంలో వర్షపు నీరు, మంచినీటి సరఫరా కలవడంతో కలుషిత నీరు వస్తోందని, దీనిపై అత్యవసర చర్యలు తీసుకోవాలని కోరారు.నియోజకవర్గ వ్యాప్తంగా స్ట్రీట్ లైట్ల నిర్వహణ తీవ్ర సమస్యగా మారిందని ఎంజీఆర్ తెలిపారు. ముఖ్యంగా ఖైరతాబాద్ డివిజన్ బాలాపూర్ బస్తీ, రామకృష్ణ నగర్ క్వార్టర్స్, జూబ్లీ హిల్స్ డివిజన్ ఇంద్రానగర్, వెంకటేశ్వర డివిజన్ దేవరకొండ బస్తీల్లో స్ట్రీట్ లైట్ల సమస్య అధికంగా ఉందని పేర్కొన్నారు. అవసరమైన స్టాక్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి ప్రత్యేక చర్యలు చేపట్టి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.ప్రజలు పాదయాత్రల్లో తెలియజేసిన ప్రతి సమస్య పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎంజీఆర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు చెల్లించకపోతే మిలిటెంట్ పోరాటం

- హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడికి బీసీ విద్యార్థి సంఘం పిలుపు
- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై ఆర్.కృష్ణయ్య ఆగ్రహం
- ఏపీ తరహాలో పూర్తి ఫీజు చెల్లించాలని డిమాండ్
- పూర్తి ఫీజు కోసం ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టీకరణ



**హైదరాబాద్, మహా :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఎంపీ ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులో జాప్యం కొనసాగితే మిలిటెంట్ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. బీసీ విద్యార్థి సంఘం సోమవారం హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల గురించి ప్రశ్నిస్తే తాను ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని, కాబట్టి ఏపీలోనే పోరాటం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం బాధాకరమని ఆర్.కృష్ణయ్య విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొంత బకాయి ఉన్నప్పటికీ అక్కడ అమలవుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానం మెరుగ్గా ఉందని అన్నారు. విద్యార్థుల పూర్తి ఫీజును అక్కడ ప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. తెలంగాణలో మాత్రం ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.35 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో విద్యార్థుల పూర్తి ఫీజును ప్రభుత్వమే భరించే విధానాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బకాయిల విడుదలతో పాటు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని

# ప్రభుత్వ ఉద్యోగాల సాధననే లక్ష్యంగా చదవాలి: ఎమ్మెల్యే రంగారెడ్డి

- ఇబ్రహీంపట్నం గ్రంథాలయంలో అదనపు గదుల ప్రారంభం
- పోలీస్ ఉద్యోగాల సాధన కోసం ప్రత్యేక శిబిరం ఏర్పాటు
- ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 3 మహా:** నియోజకవర్గంలోని యువత ప్రభుత్వ ఉద్యోగాల సాధననే లక్ష్యంగా చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలి ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయం అదనపు గదులను స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డితో కలిసి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెరుగైన గ్రంథాలయ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం ప్రకటించే ఉద్యోగాల కోసం కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఆరుట్ల గ్రామానికి చెందిన అంజన్ 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం, తన ప్రతిభకు గొప్ప నిదర్శనమని గుర్తు చేశారు. ఈ యొక్క గ్రంథాలయాలలో కావలసిన పుస్తకాలు ఫర్నిచర్ ఇతరత్రా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ ఉద్యోగాలను, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యువత సాధించాలని, దానికోసం సొంత నిధులతో ఒక ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు కావాల్సిన స్టడీ మెటీరియల్స్, ఉదయం మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తూ, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీని, ట్రైనర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, యొక్క సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రంగారెడ్డి నియోజకవర్గంలోని యువతను కోరారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, కేక్ కట్ చేసి తినిపించడం జరిగింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కమిషనర్ చేస్తున్న కృషిని గుర్తించి ఎమ్మెల్యే అభినందించాను. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం అత్యధిక నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, గ్రంథాలయం కార్యదర్శి పి.జి.వి. రాణి, ఇబ్రహీంపట్నం ఏసీబీ కేపీ రాజు, సిఐ మహేందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు ఆకుల యాదగిరి, నీళ్ల భాను, ఇందూరు శ్రీనివాస్, రాఘవేందర్, రాందాస్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌస్ పాషా, నాయకులు ఈసీ శేఖర్ గౌడ్, ముత్యాల రాజశేఖర్ రావు పాల్గొన్నారు.

# డీపీఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డా. టి కె శ్రీదేవి



**వరంగల్, కార్పొరేషన్ మహా ;**గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అమలు చేయనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ (యూజీడీ) ప్రాజెక్టుకు సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) తయారీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కార్యదర్శి డా. టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు.సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అమలు చేయనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు, అర్బన్ చాలెంజ్ ఫండ్, ఇతర పట్టణాభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా యూజీడీ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ, అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద చేపట్టాల్సిన ప్రతిపాదనలు, సాంకేతిక అనుమతులు, పరిపాలనా అంశాలు, తదుపరి కార్యాచరణపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. డా. టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి దశకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక (టైమ్‌లైన్) రూపొందించి, నిర్దేశిత గడువులోగా డీపీఆర్‌లు, అర్బన్ చాలెంజ్ ఫండ్ ప్రతిపాదనలు, ఇతర అనుబంధ ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా ప్రక్రియలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టు, అర్బన్ చాలెంజ్ ఫండ్‌కు సంబంధించిన అన్ని ప్రక్రియలు నిర్దేశిత కార్యాచరణ ప్రకారం కొనసాగుతున్నాయని తెలిపారు. డీపీఆర్ తయారీతో పాటు సాంకేతిక, పరిపాలనా అనుమతులకు సంబంధించిన అన్ని ప్రక్రియలను కూడా గడువులోగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జీడబ్ల్యూఎంసీ క్యాంపు కార్యాలయం నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు రవికుమార్, సంజయ్‌కుమార్, ఇతర ఇంజినీరింగ్ అధికారులు కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జంతర్‌మంతర్‌పై సుప్రీం విచారణ

**ఢిల్లీ, మహా:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న నిరసన ప్రదర్శనలపై సోమవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. నిరసనల నిర్వహణకు జంతర్‌మంతర్ అనువైన ప్రదేశం కాదంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయం తెలుసుకోవాలని ధర్మాసనం సూచించింది. పిటిషనర్ సతీష్ చంద్ కౌశిక్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ, జంతర్‌మంతర్ వద్ద తరచూ జరిగే ధర్నాలు, ఆందోళనల వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాతో పాటు అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య సేవల రాకపోకలకు కూడా ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరసనలు నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని గుర్తించాలని కోర్టును కోరారు. పిటిషనర్ వాదనలను పరిశీలించిన సుప్రీంకోర్టు, నిరసనల నిర్వహణ కోసం ప్రత్యామ్నాయ వేదికను ఏర్పాటు చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని సొలిసిటర్ జనరల్‌కు సూచించింది.

## దళిత క్రైస్తవుల హక్కులకు కాంగ్రెస్ అండ

**వరంగల్, మహా:** పోచమ్మ మైదాన్ సెంటర్‌లో దళిత క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత క్రైస్తవ శాంతియుత మహా దీక్షకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛ కల్పించిందని, రాజ్యాంగ విలువలకు భంగం కలగకుండా చట్టాలు అమలు కావాలని అన్నారు. క్రైస్తవులు, పాస్టర్లపై దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, దళిత క్రైస్తవుల న్యాయమైన హక్కుల సాధనకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 153 వినతులు

**వరంగల్, మహా:** జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 153 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 41, జీడబ్ల్యూఎంసీకి 30, హౌసింగ్ శాఖకు 20, ఇతర శాఖలకు 62 వినతులు వచ్చాయి. ప్రతి దరఖాస్తును త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. నిరుద్యోగుల వినతులను ప్రాధాన్యంగా పరిశీలించాలని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో టైలరింగ్ నైపుణ్యం కలిగిన వారికి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

## ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్ వద్దు

**వరంగల్, మహా:** ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడాన్ని ఏమాత్రం సహించబోమని, ప్రతి వినతిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 98 దరఖాస్తులు అందగా, వాటిని సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ బోనాలు, బతుకమ్మ పండుగలను దృష్టిలో ఉంచుకుని ఇంజినీరింగ్ అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలు, అనుమతులు, టెండర్ ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తైన నేపథ్యంలో ఆస్తి పన్ను వసూళ్లు, ట్రేడ్ లైసెన్సుల జారీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్‌కు 39, ఇంజినీరింగ్‌కు 31, ఆరోగ్యం-పారిశుద్ధ్యానికి 11, రెవెన్యూకు 9, నీటి సరఫరా విభాగానికి 8 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఉద్యమ జ్వాల పెద్ది సుదర్శన్‌రెడ్డి

తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా మారింది. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాడిన ఆయన.. చివరి శ్వాస వరకు ఉద్యమ స్ఫూర్తితోనే పనిచేశారు.
2001లో తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరిన పెద్ది సుదర్శన్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఎనిమిదేళ్ల పాటు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ తెలంగాణ ఉద్యమాన్ని గ్రామగ్రామాన విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు. పదవులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ఆశయాల కోసం పనిచేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటాల్లో పెద్ది సుదర్శన్‌రెడ్డి చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమ కాలంలో ఎదురైన కేసులు, ఒత్తిళ్లకు వెరవకుండా ముందుకు సాగారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పేదలు, రైతుల పక్షాన నిలిచారు. 2018లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశారు. గోదావరి జలాలను పాకాల చెరువుకు తీసుకురావడంలో ఆయన పాత్రను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో చర్లపల్లి డివిజన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన పెద్ది సుదర్శన్‌రెడ్డి పార్టీ విజయానికి కృషి చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలతో మమేకమై పనిచేసిన ఆయన సేవలను అక్కడి ప్రజలు స్మరించుకుంటున్నారు. ప్రజలు అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందించే స్వభావం పెద్ది సుదర్శన్‌రెడ్డి సొంతం. రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా ఆశయాల నుంచి పక్కకు తప్పుకోలేదు. మార్క్సిజం భావజాల ప్రభావంతో సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడారు



- దామరపల్లి నర్సింహారెడ్డి,
95813 58696

# జెన్ ఆల్ఫాకు మోదీ ఆకర్షణ



ఒక పక్క స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌పై వేగంగా స్క్రోల్ అవుతున్న ఇన్‌స్టాగ్రామ్ రీల్స్... మరోపక్క దూసుకుపోతున్న వందే భారత్ ట్రైన్స్, చంద్రుడిపై సగర్వంగా అడుగు పెట్టిన చంద్రయాన్3 విజువల్స్. ఆ వీడియో కింద ఓ పన్నెండేళ్ల పిల్లాడి కామెంట్.. "మోదీ జీ, వి ఆర్ విత్ యూ!" ఇది కేవలం ఒక ఇంటర్నెట్ ట్రెండ్ కాదు, "నయా భారత్" రాజకీయ ముఖచిత్రంపై మారుతున్న సరికొత్త 'వైబ్'. 2010 2024 మధ్య జన్మించిన 'జెన్ ఆల్ఫా' తరం ఓటు హక్కు లేని వయసులోనే దేశ భవిష్యత్తుపై, సుస్థిర నాయకత్వంపై చూపుతున్న ఆసక్తి పొలిటికల్ పండిట్లను సైతం ఆశ్చర్యపరుస్తోంది. ప్రధానమంత్రి నాయకత్వానికి ఈ డిజిటల్ కిడ్స్ ఎందుకు కనెక్ట్ అవుతున్నారో గ్లోబల్ స్టాండర్డ్స్‌లో విశ్లేషిస్తే పలు ఆసక్తికరమైన అంశాలు వెలుగుచూస్తాయి. ప్రధాని ఇటీవల పోస్ట్ చేసిన కేవలం 5 ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ఏకంగా 1.076 బిలియన్ల అంటే సుమారు 107 కోట్లు వ్యూస్ సాధించడం ఇంటర్నెట్‌లో పెద్ద చర్చనీయాంశమైంది. రికార్డు స్థాయి రీచ్ తో ఈ ఐదు వీడియోలు వరుసగా 103, 91.1, 186, 286 మరియు 410 మిలియన్ వ్యూస్ రాబట్టాయి. ఇది సాధారణ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు సైతం సాధ్యం కాని రీచ్. ఈ ఫాక్ట్స్ చూసి నెటిజన్లు సరదాగా "మోదీ ఇన్‌స్టాగ్రామ్ అల్గారిథమ్‌ను క్రాక్ చేశారు" అని, "పిఎమ్ మోదీ హేజ్ ఎంటర్డ్ హిజ్ రీల్స్ ఎరా" అని కామెంట్స్ చేస్తున్నారు. ఇది కేవలం ఒక సోషల్ మీడియా రికార్డు మాత్రమే కాదు. జెన్ జీ, జెన్ ఆల్ఫా జనరేషన్ తో పాటు, యువత ఎక్కువగా గడిపే ప్లాట్‌ఫామ్స్‌లో వారికి చేరువయ్యేందుకు రాజకీయ నాయకులు ట్రెడిషనల్ మీడియాను అంటే టీవీ, న్యూస్ పేపర్స్ ను దాటి 'షార్ట్‌ఫామ్ కంటెంట్' వైపు ఎలా మళ్లుతున్నారో చెప్పేందుకు ఇదొక పర్ఫెక్ట్ ఉదాహరణ.

ఇక స్క్రోలింగ్ నుంచి నేషనల్ అవేర్‌నెస్ దాకా.. తమకు ముందున్న 'జెన్ జీ తరంలో కనిపించే కొంచెం గందరగోళ ధోరణులకు భిన్నంగా జెన్ ఆల్ఫా అత్యంత వాస్తవిక దృక్పథాన్ని కలిగి ఉంది. ప్రపంచ పరిణామాలపై వీరికి అద్భుతమైన 'హైపర్‌అవేర్‌నెస్' ఉంటోంది. టెర్రర్ అటాక్స్ లేని ప్రశాంత వాతావరణం, కోవిడ్ వంటి క్రైసిస్ ను దేశం ఎదుర్కొన్న తీరు వీరి మనసుల్లో బలమైన ముద్ర వేశాయి. ఈ జనరేషన్ ఫిజికల్, డిజిటల్ ప్రపంచాల కలయిక అయిన 'ఫిజిటల్' వాతావరణంలో పుట్టి పెరిగిన మొదటి తరం. వీరికి సుదీర్ఘమైన స్పీచ్ ల కంటే, కళ్ల ముందు కనిపించే విజువల్ ప్రూఫ్స్ ముఖ్యం. 'డిజిటల్ ఇండియా' విప్లవం వీరి దైనందిన జీవితంలో భాగమైంది. ఇన్‌స్టాగ్రామ్ లాంటి ప్లాట్‌ఫామ్స్‌లో నూతన పార్లమెంట్ భవనం, రక్షణ రంగంలో ఆత్మనిర్భరత వంటివి వీరిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఇన్‌స్టంట్ ప్రాసెసింగ్ కోరుకునే ఈ పిల్లలకు, ప్రభుత్వం వేస్తున్న అడుగులు స్పష్టంగా, వేగంగా కనబడుతున్నాయి.

చాలా ఉంది. పిల్లలు సహజంగానే ఆత్మవిశ్వాసం, స్ట్రాంగ్ పర్సనాలిటీ ఉన్నవారిని ఆదర్శంగా తీసుకుంటారు. ప్రధాని మోదీ దైనందిన జీవితంలో చూపే క్రమశిక్షణ, గ్లోబల్ ప్లాట్‌ఫామ్స్ మీద ఆయనకు దక్కుతున్న గౌరవం ఈ పిల్లల్లో దేశభక్తిని పెంచుతున్నాయి. పరీక్షా పే చర్చ , రక్షాబంధన్, స్పోర్ట్స్ ఈవెంట్స్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రధాని నేరుగా విద్యార్థులతో ఇంటరాక్ట్ అవ్వడం, వారిలో స్ట్రెస్ తగ్గించి కాన్ఫిడెన్స్ నింపడం.. ఆయనను ఈ తరానికి మరింత చేరువ చేసింది. దేశం ఒక గ్లోబల్ లీడర్ చేతుల్లో సురక్షితంగా ఉందనే భరోసా వీరికి దక్కుతోంది. జెన్ ఆల్ఫా ఆలోచనల వెనుక వారి 'మిల్లెనియల్' తల్లిదండ్రుల పెంపకం ఎంతో ఉంది. ఓపెన్ డిస్కషన్స్ గతంలో కుటుంబాల్లో పాలిటిక్స్ పట్ల ఒకరకమైన ఉదాసీనత ఉండేది. కానీ ఇప్పుడు పేరెంట్స్ ఓపెన్ మైండ్‌తో దేశ ప్రగతి, సాంస్కృతిక వారసత్వం, రామమందిరం లాంటివి, అంతర్జాతీయ ఖ్యాతి గురించి పిల్లలతో చర్చిస్తున్నారు. ప్రాబ్లమ్ సాల్వింగ్ మైండ్ తో ఈ తరం పిల్లలు సమస్యలను ఒక 'గేమ్' లా చూస్తూ, ఇతరులతో కలిసి పరిష్కారాలు వెతుకుతారు. 'మేక్ ఇన్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' లాంటి కార్యక్రమాలు వీరి ఆలోచనా విధానానికి పర్ఫెక్ట్‌గా సింక్ అవుతున్నాయి. 2047 ద అల్టిమేట్ ఫ్లెక్స్ అనుకోవచ్చు. ప్రధాని మోదీ లీడర్ షిప్ లో భారత్ '2047 నాటికి వికసిత్ భారత్' గా మారాలనే విజన్‌తో ముందుకు వెళుతోంది. ఈ విజన్ సాకారమయ్యే నాటికి ఈ జెన్ ఆల్ఫా పిల్లలు మిగిలిన తరాలతో దేశాన్ని నడిపించే డ్రైవింగ్ ఫోర్స్ అవుతారు.

బ్లైండ్ గా వ్యతిరేకించడం కంటే, దేశ పురోగతినే విజయానికి మెజరింగ్ గా తీసుకునే వాతావరణం ఇప్పుడు నెలకొంది. టెక్నాలజీ ని, జాతీయవాదాన్ని బ్యాలెన్స్ చేస్తూ.. చిన్న వయసులోనే ఒక ప్రభుత్వానికి డిజిటల్ మాధ్యమాల ద్వారా మద్దతుగా నిలవడం కేవలం ఒక సోషల్ మీడియా ట్రెండ్ కాదు.. ఫ్యూచర్ ఇండియా వేయబోతున్న ఒక సాలిడ్ ఫౌండేషన్! "ఇది పాలిటిక్స్ ను మించిన ఒక గొప్ప జాతీయవాద జాగృతి."

**(శివకుమార్ గనివాడ,**
**సీనియర్ సోషల్ అనలిస్ట్)**



# డెంగ్యూ, మలేరియా ఒకేసారి వస్తాయా?

వర్షాలు ప్రారంభమవడంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో డెంగ్యూ, మలేరియా కేసులు పెరుగుతున్నాయి. చాలా మంది ఈ రెండు జ్వరాలతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా ఒకేసారి రావడం సాధ్యమేనా? వస్తే ఎలాంటి ప్రమాదం ఉంటుంది? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే సందేహాలకు యశోద హాస్పిటల్స్, హైదరాబాద్‌కు చెందిన సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కె. శేషి కిరణ్ వివరణ ఇచ్చారు.

వర్షాకాలంలో దోమల బెడద పెరగడంతో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తాయి. డెంగ్యూ, మలేరియా ఒకేసారి రావడం సాధ్యమేనని డాక్టర్ శేషి కిరణ్ తెలిపారు. రెండు వ్యాధులు ఒకే ప్రాంతంలో ఎక్కువగా ఉన్నప్పుడు ఒకే వ్యక్తికి రెండూ సోకే అవకాశం ఉంటుంది. డెంగ్యూ ఎడీస్ (Aedes) దోమ ద్వారా, మలేరియా అనాఫిలిస్ (Anopheles) దోమ ద్వారా వ్యాపిస్తాయి. ఒకేసారి రెండు ఇన్ఫెక్షన్లు రావడం అరుదే అయినప్పటికీ, ఇది ప్రమాదకర పరిస్థితిగా మారే అవకాశం ఉంది. సకాలంలో గుర్తించి చికిత్స అందించకపోతే వ్యాధి తీవ్రత పెరుగుతుంది.
డెంగ్యూ, మలేరియా ప్రారంభ లక్షణాలు దాదాపు ఒకేలా ఉంటాయి. తీవ్రమైన జ్వరం, చలి, తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, విపరీతమైన అలసట, నీరసం, వికారం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. మలేరియాలో జ్వరం విడతలవారీగా వస్తూ చలి, చెమటలు ఎక్కువగా ఉంటాయి. డెంగ్యూలో శరీర నొప్పులు తీవ్రంగా ఉండడంతో పాటు చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపించవచ్చు. అలాగే రక్తంలోని ప్లేట్‌లెట్ల సంఖ్య వేగంగా తగ్గుతుంది. అయితే ఈ లక్షణాలు ఒకదానితో ఒకటి పోలి ఉండటంతో కేవలం లక్షణాల ఆధారంగా వ్యాధిని నిర్ధారించడం కష్టం. అందువల్ల రక్తపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రెండు ఇన్ఫెక్షన్లు ఒకేసారి సోకితే వ్యాధి తీవ్రత పెరిగే అవకాశం ఉంటుంది. చికిత్స ఆలస్యమైతే శరీరంలో నీటిశాతం తగ్గడం, తీవ్రమైన రక్తహీనత, రక్తస్రావం, కాలేయం, మూత్రపిండాల సమస్యలు, రక్తపోటు తగ్గడం, అవయవాలు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే ముందుగానే వ్యాధిని గుర్తించి సరైన వైద్యం తీసుకోవడం చాలా అవసరం.

మలేరియాకు నిర్దిష్ట యాంటీ మలేరియల్ మందులు వాడాల్సి ఉంటుంది. డెంగ్యూకు ప్రత్యేక మందులు లేకపోవడంతో తగినంత ద్రవాలు తీసుకోవడం, పారాసిటమాల్‌తో జ్వరాన్ని నియంత్రించడం, ప్రమాద సంకేతాలను నిరంతరం గమనించడం వంటి సపోర్టివ్ కేర్ అవసరం. వైద్యుల సలహా లేకుండా స్వయంగా మందులు వాడకూడదు. ముఖ్యంగా ఐబుప్రోఫెన్, డిక్లోఫెనాక్ వంటి నొప్పి నివారణ మందులు డెంగ్యూ రోగుల్లో రక్తస్రావం ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉండటంతో వాటిని తీసుకోవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
డెంగ్యూ, మలేరియా నుంచి రక్షణ పొందడానికి దోమల కాటును నివారించడమే ఉత్తమ మార్గం. దోమల నివారణ క్రీములు లేదా లిక్విడ్లు ఉపయోగించాలి. శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలి. అవసరమైతే దోమతెరలు వాడాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
వర్షాకాలంలో రెండు రోజులకుపైగా తీవ్రమైన జ్వరం ఉంటే దాన్ని సాధారణ వైరల్ జ్వరంగా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలి.
డెంగ్యూ వైరస్ వల్ల వస్తుంది. మలేరియా పరాన్నజీవి వల్ల వస్తుంది. వీటితో పాటు వర్షాకాలంలో టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి వ్యాధులు కూడా ఒకేసారి సోకే అవకాశం ఉంది. రెండు వ్యాధులు కలిసి వచ్చినప్పుడు శరీర రోగనిరోధక శక్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. రక్తంలోని ప్లేట్‌లెట్లతో పాటు హిమోగ్లోబిన్ స్థాయిలు కూడా తగ్గే అవకాశం ఉంటుంది.
కడుపులో తీవ్రమైన నొప్పి, ఆగని వాంతులు, చిగుళ్లు లేదా ముక్కు నుంచి రక్తస్రావం, తీవ్రమైన నీరసం లేదా నిద్రమత్తు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి.
అనారోగ్య సమయంలో తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. కొబ్బరి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, సూప్‌లు వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్‌ను నివారించవచ్చు.

# సరిహద్దులు దాటిన డ్రాగన్ 'గూఢచర్య' జాలం

ప్రపంచాన్ని తన ఆర్థిక, సాంకేతిక శక్తితో శాసించాలని కలలుంటున్న డ్రాగన్ దేశం చైనా, ఇప్పుడు సరికొత్త మరియు ఆందోళనకరమైన రీతిలో విశ్వవ్యాప్తంగా నిఘా నేత్రాలను విస్తరిస్తోంది. తన దేశ పౌరులపైనే కాకుండా, ప్రపంచం నలుమూలల నుంచి వస్తున్న విదేశీ పర్యాటకులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలపై కూడా అత్యంత పకడ్బందీగా నిఘా పెడుతున్న వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికా పత్రిక వెలువరించిన ఈ సంచలన కథనం, అంతర్జాతీయ సమాజంలో తీవ్ర కలకలం రేపుతోంది. వ్యక్తిగత గోప్యతకు తూట్లు పొడుస్తూ చైనా సాగిస్తున్న ఈ అనైతిక నిఘా యంత్రాంగంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. జనవరి నెలలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు చైనా నిఘా తీరుతెన్నులపై పరిశోధన చేస్తుండగా ఒక విస్తుపోయే నిజం బయటపడింది. 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌లో ఆయన తన వ్యక్తిగత వివరాలను చూసి నివ్వెరపోయారు. గతంలో తాను చైనాలో పర్యటించినప్పుడు ఉపయోగించిన మొబైల్ నంబర్, పాస్‌పోర్ట్ సంఖ్య, స్వయంగా తన ఫొటో సహా సమస్త సమాచారం ఆ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమైంది. ఈ డేటా బేస్‌లో ప్రధానంగా చైనాలోని ఝూంగ్జియాకో నగరానికి విచ్చేసిన విదేశీయుల సమాచారం నిక్షిప్తం చేయబడి ఉంది. ఇందులో భారత్, పాకిస్థాన్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, బ్రిటన్, అమెరికా వంటి దేశాలకు చెందిన పౌరుల వివరాలు అధికంగా ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఝూంగ్జియాకోలోని హెబే నార్త్ యూనివర్సిటీలో విద్యనభ్యసించడానికి వెళ్లిన విదేశీ విద్యార్థుల సమాచారం, అందులోనూ భారత్, పాక్ విద్యార్థుల పేర్లే ఎక్కువగా ఉండటం పలు సందూహాలకు తావిస్తోంది.
చైనా అధికారులు ఈ నిఘా కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. విదేశీయులు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారు, ఏయే ప్రదేశాలను సందర్శిస్తున్నారు అనే ప్రతి అంశాన్ని సీసీ కెమెరాలు, ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా క్షణక్షణం ట్రాక్ చేస్తున్నారు. వీరు ఎక్కే విమానాలు, రైళ్లు, చివరికి విమానాల్లో కేటాయించిన సీటు నంబర్లతో సహా సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నారు.
ఈ నిఘా కేవలం వారు చైనాలో ఉన్నంత వరకే పరిమితం కాలేదు. సదరు విదేశీయులు తమ స్వదేశాలకు తిరిగి వెళ్లిన తర్వాత కూడా ఈ నిఘా కొనసాగుతుండటం అత్యంత భయానక పరిణామం. చైనాలోని పోలీసు విభాగానికి రోబోటిక్స్, అత్యాధునిక నిఘా పరికరాలను సరఫరా చేసే 'ఆరిజిన్ డైనమిక్' అనే సంస్థకు ఈ వెబ్‌సైట్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. సేకరించిన ఈ డేటాను అక్కడి పోలీసు శాఖకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నారు.

2019లో హాంకాంగ్‌లో తలెత్తిన ఉద్ధృతమైన ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల తర్వాతే చైనా ఈ స్థాయి నిఘాను మరింత తీవ్రతరం చేసినట్లు తెలుస్తోంది. దేశ ప్రజల విదేశీ భాగస్వాముల మీద కూడా ప్రత్యేక దృష్టి సారించి మరీ సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే, ఈ వ్యవహారం వెలుగులోకి రావడం, దుమారం రేగడంతో మే నెల నాటికి ఆ వెబ్‌సైట్‌లోని సమాచారమంతా అకస్మాత్తుగా మాయమవడం అనుమానాలకు తావిస్తోంది. అదృష్టవశాత్తూ, సైబర్ పరిశోధకుడు మార్క్ హోఫర్ అప్పటికే ఆ సమగ్ర డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడంతో డ్రాగన్ దేశం బండారం బయటపడింది. ఇప్పటివరకు ఈ సంచలన కథనాలపై చైనా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాకపోవడం గమనార్హం. ఈ పరిణామాలు ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశాలకు ఒక పెద్ద హెచ్చరికగా భావించవచ్చు. ఒక దేశం తన సరిహద్దులు దాటి ఇతర దేశాల పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాలరాయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం. కేవలం పర్యాటకం లేదా విద్య కోసం వెళ్లే వారిపై సైతం ఈ స్థాయిలో గూఢచర్యం చేయడం దారుణం. భవిష్యత్తులో ఇలాంటి ముప్పులను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ వేదికలపై దేశాలు గళం విప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వ్యక్తిగత గోప్యత హక్కును కాపాడుకోవడానికి పౌరులు కూడా డిజిటల్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## జనావాసాల మధ్య విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వ్యతిరేకంగా ఆందోళన

**మద్దతుగా పాల్గొన్న ఎమ్మెల్యే**

**కుషాయిగూడ, మహా :** కాప్రా డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీలో నివాసాల మధ్య విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కాలనీవాసులు సోమవారం ఆందోళన చేపట్టారు. సుమారు 4 వేల మంది జనాభా ఉన్న ప్రాంతంలో ఇళ్లకు ఆనుకుని సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడం సరికాదని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాసాల మధ్య విద్యుత్ సబ్ స్టేషన్ వల్ల ప్రకంపనలు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన కాలనీవాసులు, ప్రతిపాదిత నిర్మాణాన్ని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే దశలవారీగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.కాలనీవాసుల ఆందోళనకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మద్దతు ప్రకటించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడిన ఆయన, ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని నివాసాల మధ్య సబ్ స్టేషన్ ఏర్పాటును విరమించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలను పునఃపరిశీలించాలని కోరారు. నివాసాల మధ్య గత 35 సంవత్సరాలుగా సాయిరాం నగర్. సాయిబాబా నగర్. పద్మశాలి టౌన్షిప్ . ఆయా కాలనీలలో సుమారు 4000 మంది పైగా జనాలు ఉన్నారని ప్రజాభిప్రాయం లేకుండానే విద్యుత్ సబ్ స్టేషన్ ను పెట్టడాన్ని విరమించుకోవాలని లేనిచో. ప్రజా ఆందోళలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని జనాల మధ్య సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని చూడడం. బావ్యం కాదన్నారు. ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ వల్ల రేడియేషన్. అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని బండారు లక్ష్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు చేసే ఆందోళనకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సంఘీభావాన్ని ప్రకటించారు.



## ప్రజావాణిలో ఎంఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా** : నియోజకవర్గంలోని ఆయా డివిజన్ లలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ లలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, కాలనీల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలను కమిషనర్ దృష్టికి దృష్టికి తీసుకెళ్లినట్టుగా తెలిపారు. సమస్యలను విన్న కమిషనర్ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లు కొత్త రామారావు, సాయి జెన్.శేఖర్, బిఆర్ఎస్ నాయకులు కాసం మైపాల్ రెడ్డి, మురళి పంతులు, బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్భాటాలకు దూరంగా.. బైక్‌పై ప్రజల్లోకి ఎమ్మెల్యే

- బైక్‌పై కాలనీల సందర్శన.. ప్రజలతో ముఖాముఖి



**కుషాయిగూడ, మహా** : ప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సోమవారం నాచారం సర్కిల్ పరిధిలోని బాబానగర్, ఇంద్రనగర్ కాలనీల్లో కార్యకర్తలతో కలిసి బైక్‌పై పర్యటించారు. కాలనీల్లోని పలు ప్రాంతాలను పరిశీలిస్తూ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి ఆర్భాటాలు లేకుండా సాధారణంగా ప్రజల మధ్య తిరుగుతూ అందుబాటులో ఉండడం ఎమ్మెల్యే ప్రత్యేకతగా స్థానికులు పేర్కొన్నారు. ఎవరైనా సమస్యతో వస్తే వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా పేద, మెడికల్ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమవుతూ క్షేత్రస్థాయిలో పర్యటించడం ఆకట్టుకుంటోందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈరోజుల్లో అంగుళార్భాటాలు తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూనే ప్రజలకు అనుకూలంగా మెదులుతూనే నిర్ణయాలు కూడా ప్రజలకు అనుకూలంగానే తీసుకుంటూ ప్రజాభిమానాన్ని చురగొన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేలు నర్రా రాఘవరెడ్డి. సురవరం సుధాకర్ రెడ్డి. పుచ్చలపల్లి సుందరయ్య. మాకినేని బసవ పున్నయ్య. సున్నం రాజయ్య. మల్లు స్వరాజ్యం. ఆరుట్ల కమలాదేవి లాంటి ఎమ్మెల్యేలుగా పనిచేసిన హాయంలో సాదరణంగానే తిరుగుతూ ప్రజాభిమానాన్ని చురగొన్నారు.

## తొలి తరం ఉద్యమకారుడు గంధ మల్ల బాలయ్య మృతి బాధాకరం

**సంగిశెట్టి క్రిస్టఫర్**
**మలిదశ ఉద్యమకారుడు**

**వలిగొండ ఆగస్టు 3 మహా న్యూస్ :** తెలంగాణ తొలి తరం ఉద్యమకారుడు వలిగొండ మండలం లింగరాజు పల్లి గ్రామానికి చెందిన గంధమల్ల బాలయ్య సోమవారం ఉదయం 3 గంటలకు గుండెపోటుతోమృతి చెందడం పట్ల మలిదశ ఉద్యమకారుడు సంగిశెట్టి క్రిస్టఫర్ ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా మలిదశ ఉద్యమకారుడు సంఘీశెట్టి క్రిస్టఫర్మాట్లాడుతూరాష్ట్ర సాధన కోసం గంధ మల్ల బాలయ్య చేసిన కృషి మరువలేనిదని ఆయన అన్నారు ఇప్పటికే అనేక మంది ఉద్యమకారులు చనిపోయారని ప్రభుత్వం వెంటనే ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు శీలం స్వామి మారగోని శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ బత్తిని రవి బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి బొడిగె సుదర్శన్ స్వామి తదితరులు పాల్గొన్నారు



# చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు బంగ్లాదేశీయులతో పాటు మరొకరి అరెస్ట్
- 8 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- దర్యాప్తు కొనసాగుతుందని ఎస్పీ వెల్లడి



**ఆదిలాబాద్ మహా** : మావల పోలీస్ స్టేషన్ పరిధి కైలాష్ నగర్ లోని ఓ రాజకీయ నేత ఇంట్లో జరిగిన చోరీ కేసును విజయవంతంగా ఛేదించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ ముఖ్య కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.అంతర్జాతీయ అంతర్రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన బంగ్లాదేశ్ కు చెందిన మొహమ్మద్ జౌనీ అలీ ,మొహమ్మద్ రుమాన్ అలీ ,మధ్యప్రదేశ్ భోపాల్ కు చెందిన తరుణ్ సింగ్ లను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు మొహమ్మద్ జౌనీ అలీ 2 సుమారు 9 సంవత్సరాలుగా రాజస్థాన్, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో సంచరిస్తూ ఇళ్ల తాళాలు పగులగొట్టి చోరీలు, ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నట్లు వెల్లడైందన్నారు.. నిందితుడు అక్రమంగా భారతదేశంలోకి ప్రవేశించి నకిలీ ఆధార్ కార్డు పొందినట్లు కూడా విచారణలో తేలిందని తెలిపారు. ఇటీవల జూలై 11న బంగ్లాదేశ్ నుంచి భారతదేశంలోకి ప్రవేశించిన అనంతరం తన సహచరులతో కలిసి మధ్యప్రదేశ్, మహారాష్ట్ర మీదుగా ఆదిలాబాద్ చేరుకుని మావల పోలీస్ స్టేషన్ పరిధిలో కైలాష్ నగర్ నందు చోరీకి పాల్పడినట్లు తెలిపారు.నిందితులు పగటిపూట కుక్కర్లు, గ్రైండర్లు విక్రయిస్తున్నట్లు నటిస్తూ కాలనీల్లో సంచరించి ఇళ్లను రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని అన్నారు. ప్రధాన నిందితుడు మొహమ్మద్ జౌనీ అలీపై దేశంలోని పలు రాష్ట్రాల్లో 8 కు పైగా నేరాల కేసులు, సహ నిందితుడు తరుణ్ సింగ్‌పై 6కు పైగా కేసులు నమోదై ఉండగా, ముఠాలోని ఇతర సభ్యులపై కూడా వివిధ రాష్ట్రాల్లో పలు కేసులు నమోదై ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.నిందితుల వద్ద నుండి 8లక్షల విలువైన బంగారం వెండి ఆభరణాలు 4,270 నగదు, 5 ఐఫోన్లు, 2 శాంసంగ్ మొబైల్ ఫోన్లు, ఒక యాపిల్ ఐప్యాడ్ తో పాటు నేరాలకు ఉపయోగించిన ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు .ఈ ముఠాకు చెందిన ఇతర సభ్యులు, సహచరులు, అక్రమంగా భారతదేశంలో నివసించేందుకు సహకరించిన వ్యక్తులు, నకిలీ పత్రాలు సమకూర్చిన వారి పాత్రపై సంబంధిత రాష్ట్ర పోలీసులతో సమన్వయం చేస్తూ మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.దేశ భద్రతకు ముప్పుగా మారే అక్రమ విదేశీయులు, అంతర్జాతీయ మరియు అంతర్రాష్ట్ర నేర ముఠాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, సైబర్ క్రైమ్ ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది త్రిశూల్ క్రైమ్ సిబ్బంది శ్రీనివాస్ తదితరులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, మావల సీఐ బీడీ ప్రేమ్ కుమార్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సైబర్ క్రైమ్ ఎస్ఐ గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కీసర రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నబీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి/ ఘట్కేసర్ ఆగస్టు 3 మహా**:మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కీసర శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు అనంతరం శ్రీ స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సమృద్ధిగా ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం ఆలయ అర్చకులు బీర్ల అయిలయ్యకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు గడిపి భక్తులతో ఆప్యాయంగా పలకరించారు. ఆధ్యాత్మిక సంప్రదాయాలు, దేవాలయాల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తూనే, దైవానుగ్రహం కోసం తరచూ ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటున్నట్లు తెలిపారు.

## రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా విద్యాశాఖ రికార్డులు, రిజిస్టర్లను సంబంధిత అధికారులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఆడిట్ కార్యక్రమంలో పాఠశాలలో నిర్వహిస్తున్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, నగదు పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, విద్యార్థుల ప్రవేశ రికార్డులు, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల అభివృద్ధి నిధుల వినియోగం, ఇతర పరిపాలనా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆడిట్ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలు, ఆర్థిక క్రమశిక్షణకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి రికార్డును ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారుఈ కార్యక్రమంలో ఆడిట్ బృందం సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 113 అర్జీలు

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 3 మహా :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డితో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 113 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 65 , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ 15, మున్సిపాలిటీ 7, సర్వే ల్యాండ్స్ 4, సంక్షేమ శాఖ 3, వైద్య ఆరోగ్య శాఖ 3, ఇరిగేషన్ 2, డి.సి.ఓ 2, డి.పి.ఓ 2, వ్యవసాయ, విద్య, మైన్స్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆర్ అండ్ బి , మార్కెటింగ్, హౌసింగ్, సివిల్ సప్లై, జిఎం ఇండస్ట్రీస్, పశు సంవర్ధక శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయి... ప్రజావాణి అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ జయమ్మ, డిప్యూటీ కలెక్టర్ కృతిక, జెడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ అలివేలు , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా కళల్ని ప్రోత్సహించాలి

- ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నరసింహ




**భువనగిరి ఆగస్టు 3 మహా**: యాదాద్రి భువనగిరి ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ గాయని జానకి సంస్కరణ సభ స్థానిక సుందరయ్య భవన్ లో సోమవారం నిర్వహించారు గంటపాక శివ అధ్యక్షతన జరిగిన సంస్కరణ సభకు ముఖ్య అతిధిగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింహా పాల్గొని ప్రసంగించారు... దేశవ్యాప్తంగా ప్రముఖ గాయని జానకి వందలాది పాటలతో దేశాన్ని గర్వించదగినటువంటి గానంతో తన జీవితాన్ని ప్రస్తావించి అభ్యుదయ ఆలోచనలతో అనేక అవార్డులు వచ్చినా కూడా వాటికి తిరస్కరించి ప్రజల కోసం ప్రజలను చైతన్యవంతం చేయడం కోసం నిరంతరం కృషి చేసినటువంటి గాన కోకిల జానకి అని అన్నారు ఐ ఎఫ్ టి యు రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్ మాట్లాడుతూ అరుణోదయ నాగన్న అభ్యుదయ ఆలోచనతో తన పాటలతో ప్రజలను చైతన్యవంతం చేయడంలో కీలకపాత్ర వహించి వయసు మీద పడుతున్న కూడా ప్రజల కోసమే చిరస్థాయిగా నిలవాలని ఒక అభ్యుదయ శాస్త్రంగా వలచుకొని ఎక్కడో చీకాకోనగరాన పుట్టినటువంటి ఎర్రజెండ అని గ్రామస్థాయి దాకా పాట రూపంలో తీసుకువచ్చినటువంటి గొప్ప సామాజిక సాంస్కృతిక అభ్యుదయ ఆలోచనతో ఉన్నటువంటి వ్యక్తి అరుణోదయ నాగన్న అని అన్నారు సుందరయ్య భవన్లో నిర్వహించినటువంటి ఐక్య సాంస్కృతిక కళాకారుల చైతన్యంతో మనమందరం ఏకతాటి పైకి రావడం ఎంతో గర్వకారణమని భవిష్యత్తులో మనందరం ఒకే వేదిక మీద ఉండి మతోన్మాద భావాజాలన్నీ పాట రూపంలో నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, రాష్ట్ర కమిటీ సభ్యులు దేశపాక రవి, గంటేపాక శ్రీకృష్ణ,పిఎన్ఎం జిల్లా ఉపాధ్యక్షులు గుండు నరసింహ, తెలంగాణ సాహితి జిల్లా కార్యదర్శి జిట్ట భాస్కర్ రెడ్డి, రచయిత కళ్యాణి, అరుణోదయ జిల్లా బాధ్యులు ఆర్ ఉదయ్, భాస్కర్ నాయక్, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేశం, పిఎన్ఎం నాయకులు బర్రె మధు, మద్దూరు సాయి, శివగళ్ల సంపత్, గుర్రం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.




## శుభోదయ నగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

- ఒక్క సీసీ కెమెరా 100 మందితో సమానం
- సిఐ. లంకల భాస్కర్ రెడ్డి

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని శుభోదయ నగర్ ఫేజ్ 3లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కుషాయిగూడ సీఐ లెంకల భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, నేరాల నియంత్రణతో పాటు ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమని, ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటులో చొరవ చూపిన శుభోదయ కాలనీ అధ్యక్షుడు రామచందర్‌ను సీఐ భాస్కర్ రెడ్డి అభినందించి సన్మానించారు. అనంతరం "మీ సురక్ష" కార్యక్రమంతో పాటు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, ప్రజలు అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సతీష్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



## పద్మశాలి టౌన్‌షిప్ సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా ఏముల దీపా

**కుషాయిగూడ, మహా :** పద్మశాలి టౌన్‌షిప్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల్లో వేముల దీపా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 650 ఓట్లకు గాను 604 ఓట్లు పోలయ్యాయి. ఉపాధ్యక్షుడిగా బీమగాని సదానందం, ప్రధాన కార్యదర్శిగా బోగ వెంకటేష్, కోశాధికారిగా దర్గా జయకర్, సంయుక్త కార్యదర్శిగా కోల నర్సింహులు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఎన్. రమాదేవి, మేదరి సుభాష్, జి. విజయ్‌కుమార్, జడల సందీప్ విజయం సాధించారు. రెండేళ్ల పదవీకాలం గల కమిటీ ఎన్నికల్లో మూడు ప్యానెల్లు పోటీ పడగా, దీపా ప్యానెల్ ఘన విజయం సాధించింది. కిషోర్ రెడ్డి, నవీన్ గౌడ్ ప్యానెల్లు పరాజయం పాలయ్యాయి.దీపా ప్యానెల్ విజయం పట్ల భావనారిషి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సీతా ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.



## అంగన్‌వాడీ కేంద్రాల బకాయిలు వెంటనే విడుదల చేయాలి : సీఐటీయూ

**కుషాయిగూడ, మహా :** జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అద్దె బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే. ఉన్నికృష్ణన్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో జిల్లా అదనపుకలెక్టర్ డి విజేందర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. అద్దె బకాయిలతో పాటు వేతనాలు, గ్యాస్ బిల్లులు, కూరగాయల బిల్లులు చెల్లించకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీవ్ర ఇబ్బందులకు గురవుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి కేంద్రాల నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. పదవీ విరమణ చేసిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇప్పటికీ పదవీ విరమణ ప్రయోజనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి నెలకొన్నందున వారికి వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయాలంటే ఉద్యోగుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న అద్దెలు, వేతనాలు, గ్యాస్, కూరగాయల బిల్లులను వెంటనే చెల్లించాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి యూనియన్ విజ్ఞప్తి చేసింది.



# మాజీ మంత్రి పురుషోత్తం రెడ్డి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 3 మహా** స్వర్గీయ మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ స్వర్గీయ మాజీ మంత్రి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి ప్రజా సేవకు అంకితభావంతో పని చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడిగా ఆయన చిరస్థాయిగా గుర్తుండిపోతారని అన్నారు.. రానున్న రోజులలో గుండాల మండల కేంద్రంలో ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా జీవితాంతం సేవలందించిన పురుషోత్తం రెడ్డి గారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారి సేవలు, త్యాగాలు, ప్రజల పట్ల ఉన్న నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.. అనంతరం అక్కడున్న నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడెపు సంజీవరెడ్డి, ఈరసరం యాదగిరి గౌడ్, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్

**భువనగిరి ఆగస్టు 3 మహా**:యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ను యాదాద్రి భువనగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భువనగిరి మున్సిపాలిటీ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఐకమత్య భావం పెంపొందించడంలో ఇటువంటి క్రీడా పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె అన్నారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మంగ ప్రవీణ్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యువతను ఒకే వేదికపైకి తీసుకువచ్చి క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొంటున్న అన్ని జట్లు క్రీడాస్ఫూర్తితో ఆడి విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తీ, బర్రె జహంగీర్, పోలిశెట్టి అనిల్, అంగడి నాగరాజు, జహంగీర్, సోమయ్య, కొల్లూరి రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



# సకాలంలో పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 3 మహా** జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సకాలంలో అనుమతులు ఇవ్వాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం మినీ మీటింగ్ హాల్ లో టీజి ఐపాస్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ఎండిఏ మరియు పీసీబీ అధికారులు పెండింగ్ లో ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిఐపిసి లో భాగంగా 7 మంది యస్. టి లబ్ధిదారులకు రాయితీ మరియు నాలుగు పరిశ్రమలకు సంబంధించి రా మెటీరియల్ మంజూరీ కి ఆమోదించడం జరిగింది. 7 మంది ఎస్టీ లబ్దిదారులకు దాదాపు 17.5 లక్షల రాయితీ మంజూరీ కమిటీ సభ్యుల తో చర్చించి అమోదించడం జరిగిందని తెలిపారు.. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రవీందర్,, ట్రాన్స్పోర్ట్ అధికారి నరేష్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: నవ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పాల్వంచ జగన్నాధపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోహిణి ఫౌండేషన్ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. జిల్లా విద్యాశాఖ ప్రతినిధి సైదులు మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు, డిజిటల్ పరికరాలు, కంప్యూటర్ బోధన, అదనపు తరగతి గదుల నిర్మాణం వంటి నవ సీఎస్ఆర్



సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరామూర్తి, సీఎస్ఆర్ హెడ్ డి.సుధాకర్, లైజన్ అధికారి సీవీవీఎస్ మూర్తి, ఇతర అధికారులు, రోహిణి ఫౌండేషన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు





# పార్టీ బోలోపేతమే లక్ష్యం

- మండల కమిటీ నియామకాలు
- ఆదిలాబాద్ రూరల్, మావల మండల సమావేశాలు
- శ్రేణులకు కంది శ్రీనివాస రెడ్డి , నరేష్ జాదవ్ దిశానిర్దేశం



**ఆదిలాబాద్ మహా** : కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు కృషి చేయాలని మండల కమిటీలో పనిచేసే నాయకులకు స్థానం కల్పించాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ , మాజీ ఎంపీ సోయం బాపూరావు సూచించారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ నియమాకాల కోసం సోమవారం పట్టణంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్లో నిర్వహించిన మావల ,ఆదిలాబాద్ రూరల్ మండల స్థాయి సమావేశానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి వారు హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలలో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కంది శ్రీనివాస రెడ్డి సూచించారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తాను చేస్తున్నట్టుగా స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ కుట్రలను తిప్పి కొట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు.ఎంపిక చేసిన మండల కమిటీ సభ్యులు మండల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.గెలుపోటములు ముఖ్యం కాదని ఒకసారి ఓడినా రేపటి గెలుపుపై ఆశతో పని చేయాలన్నారు. నూతన మండల కమిటీల నియామకంలో ఎలాంటి వర్గ విభేదాలకు తావులేకుండా అందరినీ కలుపుకొనిపోవాలని డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ అన్నారు. సామాజిక న్యాయం పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను సిద్ధం చేయాలని సూచించారు.ప్రతి మండల కమిటీలో మండల అధ్యక్షునితో కలిపి మొత్తం 22 మంది సభ్యులు ఉంటారన్నారు.. ఇందులో ఇద్దరు ఉపాధ్యక్షులు, నలుగురు ప్రధాన కార్యదర్శులు ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. పార్టీ కమిటీలలో మహిళా నాయకులకు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు.కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నామని సోయం బాపూరావు అన్నారు. బూత్,గ్రామ, మండల వర్గ విభేదాలు లేకుండా కలిసికట్టుగా పనిచేసేవారు కమిటీలో పేర్లను ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయ ఏర్పాటు కోసం అందిస్తున్న 2200 కోట్ల నిధులు, రేషన్ కార్డులు, ఉచిత సన్న బియ్యం, ఉచిత కరెంటు, మహిళలకు ఫ్రీ బస్సు,లాంటి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య , ఆదిలాబాద్, మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ,ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్‌రావు, నాయకులు సాజీద్ ఖాన్ అల్లూరి సంజీవ రెడ్డి , మాధవ్ పటేల్ గిమ్మ దీపక్ , సెద్మకి ఆనందరావు , శాంతన్ రావు , గౌలి సంజీవ్ కుమార్ ,మల్యాల కరుణాకర్, అక్తర్ అలీ , లక్ష్మారెడ్డి , బెజ్జంకి అనిల్ మావల ఆదిలాబాద్ మండలాల ముఖ్య నాయకులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ కోసం కంది శ్రీనివాస రెడ్డి భారీ విరాళం

- 5 లక్షల 51వేల చెక్కును అందించిన అసెంబ్లీ ఇంచార్జి
- ధన్యవాదాలు తెలిపిన డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్

**ఆదిలాబాద్ మహా** : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు కోసం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి 5 లక్షల 51వేల రూపాయల భారీ విరాళాన్ని అందించారు. శనివారం జరిగిన ఆదిలాబాద్ జిల్లా పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మీటింగ్ లో పార్టీ ఆఫీస్ కోసం మన రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గం కేటాయించిన ఒక ఎకరం భూమి రిజిస్ట్రేషన్ కొరకు సహాయం అందించాల్సిందిగా డీసీసీ అధ్యక్షుడి విజ్ఞప్తికి మేరకు మొట్టమొదటగా తాను అదే రోజు స్పందించి భూమి రిజిస్ట్రేషన్ కోసం అయ్యే పూర్తి ఖర్చులు తాను భరిస్తానని ఇచ్చిన హామీ ప్రకారం మాట నిల బెట్టుకున్నానన్నారు. సోమవారం పట్టణంలోని చిలుకూరి లక్ష్మీ గార్డెన్ లో జరిగిన మావల ఆదిలాబాద్ రూరల్ మండల కమిటీ సమావేశంలో తమ కుటుంబం తరపున 5 లక్షల 51వేల రూపాయల చెక్కులను డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ కు కు అందించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.. ఈ నిధుల్ని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఆఫీస్ ల్యాండ్ రిజిస్ట్రేషన్ కొరకు వాడగలరని ఆయన విజ్ఞప్తి చేసారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం, రాహుల్ గాంధీ గారిని ప్రధాన మంత్రిగా చేయడం కోసం, రేవంత్ రెడ్డి గారిని మరొకసారి ముఖ్యమంత్రిని చేయడం కోసం అందరం కలిసి కట్టుగా మరింత కష్టపడదామని పిలుపునిచ్చారు. అటు భారీ విరాళాన్ని అందించిన కంది శ్రీనివాస రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ కృత జ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య , ఆదిలాబాద్, మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి , ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు సాజీద్ ఖాన్ అల్లూరి సంజీవ రెడ్డి , మాధవ్ పటేల్ గిమ్మ దీపక్ , సెద్మకి ఆనందరావు , శాంతన్ రావు , గౌలి సంజీవ్ కుమార్ ,మల్యాల కరుణాకర్, అక్తర్ అలీ , లక్ష్మ రెడ్డి , బెజ్జంకి అనిల్ మావల ఆదిలాబాద్ మండలాల ముఖ్య నాయకులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి ఆగస్టు 3 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించారు.. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న చికిత్స, మందుల లభ్యత, అత్యవసర వైద్య సేవలు, ఆసుపత్రిలో ఉన్న వసతులపై సమగ్రంగా ఆరా తీశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల నిల్వలు, వాటి కాలపరిమితి, అవసరమైన అన్ని రకాల మందులు సరిపడా ఉన్నాయా లేదా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. అలాగే కొరత ఉన్న వైద్య, పారామెడికల్ సిబ్బంది వివరాలను సేకరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 108 అంబులెన్స్ సేవల పనితీరు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన సమయం, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. అంబులెన్స్ సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)తో ఫోన్‌లో మాట్లాడిన బీర్ల అయిలయ్య ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది కొరత, మందుల లభ్యత, గడువు ముగిసే మందుల పరిస్థితి, 108 అంబులెన్స్ సేవలు తదితర అంశాలపై పూర్తి నివేదికను వెంటనే అందజేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో కూడా మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో చికిత్స అందేలా అధికారులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు

# 'ఒకే కాలనీ.. ఒకే బూత్'కు గ్రీన్ సిగ్నల్

**సత్తుపల్లి, ఆగస్టు 3:మహా** ఒకే కాలనీ, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లు, వార్డుల్లో నమోదై ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారం దిశగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఇచ్చిన ఆదేశాలను జిల్లా వ్యాప్తంగా కచ్చితంగా అమలు చేయాలని బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల వీరంరాజు జిల్లా కలెక్టర్‌ను కోరారు. రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో నమోదవుతున్న సమస్యను గతంలో భాస్కర్ల వీరంరాజు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సమస్యను పరిష్కరించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఆదేశాల అమలు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో వీరంరాజు మరోసారి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వెంటనే స్పందించి సంబంధిత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి సహకరించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్‌కు వీరంరాజు కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలతో పాటు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ ఒకే కాలనీ, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. క్షేత్రస్థాయి ఎన్నికల సిబ్బంది ఎన్నికల సంఘం ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేసి ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

# సేవా సమితి ఆధ్వర్యంలో బియ్యం పంపిణి

**మందమర్రి, మహా :** ఆదరించు స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం మందమర్రి పట్టణంలో ఓ నిరుపేద కుటుంబానికి నిత్యవసర సరుకులు, బియ్యంపంపిణి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సేవ సంస్థ మునిసిపాలిటీలోని యాపల్‌కు చెందిన మారాపెల్లి నాగరాజు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు కాంపాటి మురళి వెల్లడించారు. ఆ యొక్క కుటుంబం పెద్ద దిక్కును కోలిపోవటంతో నాగరాజు భార్య ఒక ప్రైవేట్ పాఠశాలలో ఆయాగా పనిచేస్తూ ఇద్దరు చిన్న పిల్లలను పోషిస్తూ కుటుంబాన్ని ఎంతో కష్టంగా నెట్టుకొస్తున్నా విషయాన్ని తెలుసుకున్న మా సంస్థ మిత్రులు ఆ కుటుంబాన్ని పరామర్శించి, దాతల సహకారంతో 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, స్కూల్ బ్యాగ్ తో పాటు 1000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వరద రాబర్ట్, సీపాతి రమేష్, కందుల శ్రీకాంత్, చెరుకు సంపత్,రాధ,జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ఐఎన్టీయూసీ ఉద్యమ ఫలితమే సింగరేణి ఖాతాలోకి పీ.కే ఓసి డీప్ సైడ్ బ్లాక్

**తీగల క్రాంతికుమార్**

**సత్తుపల్లి, ఆగస్టు 3**:మహ : మణుగూబరు ప్రాంతంలోని పీ.కే ఓసి-2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించడం కార్మికుల ఐక్యతకు, ఐఎన్టీయూసీ చేపట్టిన ఉద్యమానికి దక్కిన విజయమని సత్తుపల్లి ఏరియా ఐఎన్టీయూసీ జాయింట్ జనరల్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు ఆగస్టు 1న సింగరేణి వ్యాప్తంగా వేలాది మంది కార్మికులతో చేపట్టిన ఉద్యమం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం పీ.కే ఓసి-2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించిందన్నారు. ఈ నిర్ణయం సింగరేణి సంస్థకు, కార్మికులకు కీలకమని తెలిపారు. గతంలో తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని డాక్టర్ బి. జనక్ ప్రసాద్ నేతృత్వంలో కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించామని, దాని ఫలితంగా ఆ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించినట్లు తెలిపారు. అదే క్రమంలో పీ.కే ఓసి డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే ఇవ్వాలని కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూల నిర్ణయం వెలువడిందన్నారు.ఈ కేటాయింపుతో వేలాది మంది కార్మికుల ఉద్యోగ భద్రత మరింత బలపడటంతో పాటు స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మణుగూరు ప్రాంత పారిశ్రామికాభివృద్ధికి ఈ నిర్ణయం కొత్త ఊపు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించే వరకు ఐఎన్టీయూసీ పోరాటం కొనసాగుతుందని, సింగరేణి సంస్థ బలోపేతం, కార్మికుల హక్కుల పరిరక్షణలో యూనియన్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన నిలుస్తుందని తీగల క్రాంతికుమార్ స్పష్టం చేశారు.



# స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం

- జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ కే.అజయ్ కుమార్
- సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ అధ్వర్యంలో 'స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్స్"కు శిక్షణ శిబిరం ప్రారంభం

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని సింగరేణి జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ కే.అజయ్ కుమార్ అన్నారు.సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే స్కౌట్స్ అండ్ గైడ్ శిక్షణ శిబిరాన్ని సోమవారం సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ చిల్డ్రన్స్ పార్క్ నందు జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ కే.అజయ్ కుమార్ ప్రారంభించి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకావిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ విద్యార్థులకు దేశ భక్తి నాయకత్వ లక్షణాలు విపత్తుల సమయంలో ధైర్యముగా ముందుకు వెళ్ళి సేవ చేసే విధంగా శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవరచుకునేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం దోహద పడుతుందని అందుకే యువతను మరింతగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని ఇందుకు సింగరేణి యాజమాన్యం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించి ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ శిక్షణా శిబిరంలో నేర్చుకున్న అంశాలను యూనిట్ లీడర్స్ వారి యొక్క పాఠశాలలో కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి రాష్ట్రపతి, గవర్నర్ అవార్డులు సాధించేందుకు గాను అందరూ కృషి చేయాలని ప్రస్తుత సమాజంలో మారుతున్న పరిణామాలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని సింగరేణి అన్ని ఏరియాలలోని సింగరేణి పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్ ను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ కమిషనర్ బి.శివ కేశవరావు, సీనియర్ పిఓ అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ మండల శ్రీనివాస్, డివైపిఎం కే.సునీల్ కుమార్, బిఎస్‌జి కో ఆర్డినేటర్ పి.సాయి నిరంజన్, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సింగరేణి ఎయిడెడ్ కొత్తగూడెం, ఇల్లందు, బెల్లంపల్లి, గోలేటి, మందమర్రి, మణుగూరు, శ్రీరాంపూర్, భూపాలపల్లి, గోదావరిఖని పాఠశాలల నుండి స్కౌట్ మాస్టర్స్, రోవర్ స్కౌట్ లీడర్స్ రోవర్స్, సీనియర్ రోవర్ స్కౌట్ లీడర్లు కే.భాస్కర్, వి.వెంకట స్వామి, ఎల్.గోపాల కృష్ణయ్య, ఎం.కొమరయ్య, మెంగని అశోక్, కే.వి. ప్రసాద్, రామస్వామి పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

- అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం ప్రగతి మైదానంలో ఈనెల 15వ తేదీన జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జిల్లాకు ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రగతి మైదానంలో ప్రధాన వేదికను ఆకర్షణీయంగా రూపొందించడంతో పాటు ప్రోటోకాల్‌కు అనుగుణంగా ప్రజాప్రతినిధులు స్వాతంత్ర్య సమరయోధులు అధికారులు విశిష్ట అతిథులు మీడియా ప్రతినిధులు విద్యార్థులు ప్రజలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రవేశ నిష్క్రమణ మార్గాలను సక్రమంగా ఏర్పాటు చేసి బ్యారికేడ్లు పార్కింగ్ సూచిక బోర్డులు తాగునీటి సదుపాయం పారిశుద్ధ్యం మొబైల్ టాయిలెట్లు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వాటర్‌ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు వేదిక విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచి సౌండ్ సిస్టమ్ మైకులు లైటింగ్ ఎల్ఈడీ స్క్రీన్లు ముందస్తుగా పరీక్షించాలని సంబంధిత శాఖలకు సూచించారు.వేడుకల ప్రాంగణంలో 108 అంబులెన్స్ వైద్య బృందాలు ప్రథమ చికిత్స కేంద్రం అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని ఆరోగ్య శాఖకు ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఫైర్ టెండర్లను సిద్ధంగా ఉంచాలని పోలీసు శాఖ ట్రాఫిక్ నియంత్రణ పార్కింగ్ భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం భారత ప్రభుత్వ ప్రోటోకాల్‌కు అనుగుణంగా అత్యంత గౌరవప్రదంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని తెలిపారు. వ్యవసాయం ఉద్యానవనం పశుసంవర్ధక అటవీ వైద్యం విద్య పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమం ఆర్టీసీ తదితర శాఖలు తమ కార్యక్రమాలను ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులతో దేశభక్తి గీతాలు సాంస్కృతిక కార్యక్రమాలు నృత్యాలు నాటికలు నిర్వహించి జాతీయ భావనను పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించాలని తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రశంసా పత్రాల ప్రదానం కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు ఉద్యోగుల వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు తమకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి సమన్వయంతో పనిచేసి జిల్లా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తులను నమ్మవద్దు

- లైసెన్స్‌లు, శిక్షణ కోసం నేరుగా శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలి
- జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో, అలాగే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆహార భద్రత తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్న సందర్భంలో, కొందరు వ్యక్తులు జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగానికి చెందిన అధికారులమని చెప్పుకుంటూ వ్యాపారులను మోసగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ దృష్టికి వచ్చినట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు "ట్రైనింగ్ సర్టిఫికెట్లు ఇప్పిస్తాం", "లైసెన్స్‌లు ఇప్పిస్తాం" అంటూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఇటువంటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని, వారికి ఎలాంటి నగదు చెల్లించవద్దని వ్యాపారులకు సూచించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్లు, శిక్షణ కార్యక్రమాలు లేదా ఇతర అధికారిక సేవలకు సంబంధించి అవసరమైన సమాచారం కోసం నేరుగా జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖ అధికారులను మాత్రమే సంప్రదించాలని తెలిపారు. అధికారిక విధానాల ప్రకారమే అన్ని సేవలు అందించబడతాయని స్పష్టం చేశారు. వ్యాపారులు అప్రమత్తంగా ఉండి మోసగాళ్ల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనల గురించి వెంటనే జిల్లా ఫుడ్ సేఫ్టీ శాఖకు సమాచారం అందించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మనోజ్ కుమార్ కోరారు.



# బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

- సింగరేణి ఏరియా జిఎం వెంకటరమణ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ సూచించారు.సోమవారం ఆయన పీవీకే 5 ఇంక్లైన్ గనిని సందర్శించి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం వెంకటరమణ మాట్లాడుతూభద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఉద్యోగి సురక్షితంగా విధులు నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. గనిలో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రమాద రహిత వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు. సింగరేణి ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అధికారులు ఉద్యోగులు ఒక జట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఉద్యోగుల సంక్షేమం పని పరిస్థితుల మెరుగుదల పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఉద్యోగుల సూచనలు సలహాలకు ప్రాధాన్యత ఇస్తూ అందరితో సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం సి హెచ్.వెంకటరమణతో పాటు ఎస్.ఓ టు జీఎం ఎం.గోవిందరావు, ఏజెంట్ పీవీకే రామ్ భరోస్ మెహతో, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, గ్రూప్ ఇంజనీర్ గోదావరి శ్రీనివాస్, మేనేజర్ పి.రవికిరణ్, సేఫ్టీ ఆఫీసర్ ఆర్.అనిల్ సాగర్, పిట్ ఇంజనీర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ భూక్య రమేష్, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ చిలక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ ఏఈ అనూష హఠాన్మరణం

- గుండెపోటుతో ఆసుపత్రిలో కన్నుమూత
- సంతాపం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 3 మహా:** ఇబ్రహీంపట్నం మిషన్ భగీరథ ఎఇ అనూష (33) హఠాన్మరణం చెందారు. వనస్థలిపురం లోని వారి ఇంట్లో తీవ్రమైన గుండెపోటుతో కుప్పకూలిన అనూషను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల పాటు నగరంలోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మిషన్ భగీరథ ప్రాజెక్టులో ఇబ్రహీంపట్నం సహాయక ఇంజనీర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమె అబ్దుల్లాపూర్ మెట్ అదనపు బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. అనూష కు భర్త, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. చిన్న వయసులోనే మంచి అధికారినిగా గుర్తింపు పొందిన అనూష ఆకస్మిక మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కార్యక్రమం ప్రారంభం నుండి ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఆమె చాలా కష్టపడి పనిచేశారని వారు గుర్తు చేశారు. ఎఇ అనూష ఆకస్మిక మరణంతో ఇబ్రహీంపట్నంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# మణుగూరుకు ఊపిరి.. సింగరేణికి జీవనాడి..

- పికేఓసీ-2 డీప్ సైడ్ బ్లాక్ సొంతం చేసుకున్న ఎస్‌సీసీఎల్...
- ఉపాధి, ఉత్పత్తి, ప్రాంతీయ అభివృద్ధికి కొత్త ఆశలు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సింగరేణి ఏరియా భవిష్యత్తును నిర్దేశించే అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ఓసీ2 డీప్ సైడ్ బొగ్గు బ్లాక్‌ను వేలంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) దక్కించుకోవడంతో కార్మికులు, వ్యాపార వర్గాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ బ్లాక్ లభించడం వల్ల మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి కొనసాగింపుతో పాటు వేలాది ఉద్యోగాల భద్రత, భవిష్యత్ ఉపాధి అవకాశాలు, స్థానిక వ్యాపారాల అభివృద్ధికి బలమైన భరోసా లభించిందననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మణుగూరు పట్టణ ఆర్థిక వ్యవస్థకు సింగరేణి జీవనాడిగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాంత భవిష్యత్తుకు కీలక మలుపుగా మారిందని పలువురు పేర్కొన్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ కృషి ఫలించింది: భట్టి విక్రమార్క..**

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ, మణుగూరు ఓసీ2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణి దక్కించుకోవడం రాష్ట్ర ప్రభుత్వ నిరంతర ప్రయత్నాల ఫలితమని తెలిపారు. ఈ నిర్ణయం మణుగూరు ప్రాంతానికి, సింగరేణి సంస్థకు కొత్త జీవం పోసే పరిణామమని అన్నారు.

**ప్రాంత అభివృద్ధికి బలమైన అడుగు: ఎమ్మెల్యే పాయం..**

మణుగూరు ఏరియా పీకేఓసి 2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణి సంస్థ వేలంలో దక్కించుకోవడంతో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ బ్లాక్‌తో సింగరేణి మరింత బలోపేతం కావడంతో పాటు కార్మిక సంక్షేమం, ఉపాధి అవకాశాలతో పాటు మణుగూరు ప్రాంత అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవే కారణం: బీజేపీ**

మణుగూరు మండల బీజేపీ నాయకులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్లే ఓసీ2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ఉత్పత్తి పెంపు, ఉపాధి కల్పనకు దోహదపడుతుందని, ఆధునిక సాంకేతికతతో తవ్వకాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

**రేవంత్ ప్రభుత్వ కృషి ఫలితం: ఐఎన్‌టీయూసీ..**

ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజు మాట్లాడుతూ, ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలంటూ అన్ని ఏరియాల్లో తమ సంఘం పోరాటం చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చొరవతో బ్లాక్ దక్కిందని, మరో రెండు దశాబ్దాల పాటు మణుగూరు ప్రాంతానికి స్థిరమైన భవిష్యత్తు లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

**ఇది కార్మికుల విజయం: ఐఎఫ్‌టీయూ**

ఐఎఫ్‌టీయూ అనుబంధ గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.డి నాసర్ పాషా మాట్లాడుతూ, ఇది సింగరేణి, కాంట్రాక్ట్ కార్మికులు, మణుగూరు ప్రజల ఉమ్మడి విజయమన్నారు. మణుగూరు మనుగడ కోసం సాగిన ఉద్యమాలకు ఇది ఫలితమని పేర్కొంటూ, డీప్ సైడ్‌లో శాశ్వత కార్మికులతోనే ఉత్పత్తి చేపట్టాలని డిమాండ్ చేశారు.

**పర్మినెంట్ కార్మికులతోనే ఉత్పత్తి చేయాలి: హెచ్ఎంఎస్**

హెచ్ఎంఎస్ తెలంగాణ రక్షణ సేన నాయకులు కోడిపల్లి శ్రీలత, దరిసా రమేష్ లు మాట్లాడుతూ, డీప్ సైడ్ బ్లాక్ రావడం సంతోషకరమని పేర్కొన్నారు. దీనితో సరిపెట్టకుండా భవిష్యత్తులో కూడా సింగరేణికే బొగ్గు బ్లాక్‌లు కేటాయించాలని, ఈ గనిలో శాశ్వత కార్మికులతోనే ఉత్పత్తి చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

**సామూహిక ఉద్యమ ఫలితమే: సీపీఐ–ఏఐటీయూసీ**

సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఈ సందర్భంగా మాట్లాడుతూ, డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికి కేటాయింపులో కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, మీడియా, ప్రజల ఐక్య ఉద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు. ఇది ఒక్కరి విజయం కాదని, మణుగూరు సమాజం సాధించిన విజయమని పేర్కొన్నారు.

**సింగరేణి సామర్థ్యానికే దక్కిన విజయం: టిబీజీకేఎస్**

టిబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ బ్లాక్ ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల కాకుండా సింగరేణి సంస్థ సామర్థ్యం, అనుభవం, అధికారుల సమర్థ నిర్వహణ వల్లే దక్కిందన్నారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు, ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ చేసిన కృషి ప్రశంసనీయమని తెలిపారు.

**అభివృద్ధికి నాంది**

ఓసీ2 డీప్ సైడ్ బ్లాక్ దక్కడం పట్ల సింగరేణి కార్మికులు, వ్యాపార వర్గాలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. త్వరితగతిన గని అభివృద్ధి పనులు ప్రారంభించి, స్థానికులకు ప్రాధాన్యంతో ఉపాధి కల్పించడం, పర్యావరణ పరిరక్షణ, నిర్వాసితుల పునరావాసంపై సమాన దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# మిత్రుని కుటుంబానికి రూ.2.01 లక్షల ఆర్థిక సాయం

**స్నేహితుల దినోత్సవం సందర్భంగా అండగా నిలిచిన బీటెక్ మిత్రులు**

**వరంగల్, మహా;**వరంగల్ కాశీబుగ్గ 20వ డివిజన్ కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు జక్కి అశోక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు, కిట్స్ కళాశాల బీటెక్ మిత్రులు అండగా నిలిచారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా సోమవారం రూ.2.01 లక్షల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. గత నెలలో కూడా ఇదే మిత్రబృందం రూ.75 వేల సాయం చేసింది. తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న అశోక్ దళిత బంధు పథకం ద్వారా సిమెంట్ దుకాణం నిర్వహించేవారు. అనంతరం వ్యాపారంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్థాపానికి గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అశోక్ ఆర్థిక పరిస్థితి, కుటుంబ సభ్యుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని గోరంటల మనోహర్ అమెరికాలో ఉన్న స్నేహితులకు వివరించడంతో ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. అందులో భాగంగా రూ.2.01లక్షలను అమెరికా లోని కిట్స్ కళాశాల బీటెక్ క్లాస్‌మేట్స్, స్థానిక మిత్రులు కలిసి విరాళాలు సేకరించి ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. అశోక్ భార్య, కుమారుడికి భవిష్యత్తు లోనూ అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీటెక్ మిత్రులు, కాశీబుగ్గ చిన్ననాటి స్నేహితులు, బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఆర్టీఏ సభ్యుడు గోరంటల మనోహర్, రామకృష్ణ, చల్లా వేణుగోపాల్, ఊరుగొండ రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సహాయం అందించిన వారందరికీ అశోక్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



# ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

- ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:**ప్రజావాణి వినతుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దని ప్రతి దరఖాస్తును గడువులోగా పరిష్కరించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, డిఆర్ఓ పద్మావతి లతో కలిసి స్వీకరించారు. భూ సంబంధిత వివాదాలు రెవెన్యూ అంశాలు సంక్షేమ పథకాల అమలు ఉపాధి పెన్షన్లు గృహాలు మౌలిక వసతులు సామాజిక భద్రత తదితర సమస్యలను ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం కల్పించిన అత్యంత కీలక వేదిక అని అన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం జాప్యానికి ఎలాంటి అవకాశం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖలకు వెంటనే పంపించి గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే పరిష్కరించగల అంశాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.శాఖల మధ్య సమన్వయం సమర్థవంతమైన కార్యాచరణ ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని కలెక్టర్ అన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ పరిష్కార స్థితిని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా స్పందించి ప్రభుత్వ సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందించాలని తెలిపారు. ప్రజలు తమ వినతులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత త్వరగా జరిగే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన జవాబుదారీతనంతో కూడిన పాలన అందించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణికి 102 ఫిర్యాదులు

**రంగారెడ్డి, మహా**: సమీకృత జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 102 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 33, ఇతర శాఖలకు 69 వినతులు వచ్చాయి. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, డీఆర్వో శారదతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు



# శాశ్వత బంధానికి ప్రేమే బలం: సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తన వైవాహిక జీవితంపై ఆసక్తికరమైన అభిప్రాయాలను వెల్లడించారు. త్వరలో తమ వివాహ వార్షికోత్సవం రానున్న సందర్భంగా భార్య జ్యోతికతో తన బంధం గురించి మాట్లాడిన ఆయన, విజయవంతమైన దాంపత్య జీవితానికి ప్రేమ, పరస్పర గౌరవమే ప్రధాన ఆధారాలని చెప్పారు. ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమవుతున్నాయి.దాదాపు ఇరవై ఏళ్లుగా అన్యోన్య దంపతులుగా కొనసాగుతున్న సూర్య-జ్యోతిక జంట దక్షిణ భారత సినీ పరిశ్రమలో ఆదర్శ దంపతులుగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ, పెళ్లి అనేది ప్రేమకు ముగింపు కాదని, అసలు జీవిత ప్రయాణం అక్కడి నుంచే ప్రారంభమవుతుందని అన్నారు. దాంపత్య జీవితంలో ప్రతిరోజూ ప్రేమను వ్యక్తం చేస్తూ, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకు సాగితే బంధం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. కాలంతో పాటు మనిషి ఆలోచనలు, అభిరుచులు, జీవన విధానం మారడం సహజమేనని, అయితే జీవిత భాగస్వామిపై చూపించే గౌరవం, ఆప్యాయత మాత్రం ఎప్పటికీ తగ్గకూడదన్నారు. ఇద్దరి మధ్య నమ్మకం, ఓర్పు, పరస్పర సహకారం ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా సులభంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. మహిళల పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించిన సూర్య, కుటుంబం కోసం వారు చేసే త్యాగాలు అమూల్యమని అన్నారు. ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యోగాన్ని కూడా సమర్థంగా నిర్వహిస్తూ కుటుంబాన్ని ముందుకు నడిపించే మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. వారి కష్టాన్ని గుర్తించి ప్రతి భర్త అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. సూర్య-జ్యోతిక పరిచయం ఒక సినిమా షూటింగ్ సమయంలో ప్రారంభమై, కొన్నేళ్ల ప్రేమ తర్వాత కుటుంబ సభ్యుల అంగీకారంతో వివాహ బంధంగా మారింది. ప్రస్తుతం ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ జీవితానికి ప్రాధాన్యం ఇస్తూనే ఇద్దరూ తమ సినీ ప్రయాణాన్ని కూడా విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఇటీవల సూర్య నటించిన చిత్రాలు ప్రేక్షకుల ఆదరణ పొందగా, జ్యోతిక కూడా విభిన్న కథాంశాలతో కూడిన చిత్రాలు, వెబ్ సిరీస్‌ల ద్వారా తన నటనను కొనసాగిస్తున్నారు.

ఇద్దరూ తమ కెరీర్‌ను సమతుల్యంగా కొనసాగిస్తూ కుటుంబానికి కూడా సమయం కేటాయించడం విశేషం. ప్రస్తుతం సినీ రంగంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ స్ఫూర్తిదాయకమైన జంటగా సూర్య-జ్యోతిక నిలుస్తున్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో దాంపత్య బంధాన్ని నిలబెట్టుకోవాలంటే పరస్పర గౌరవం, నమ్మకం, ప్రేమ, ఒకరికొకరు సమయం కేటాయించడం ఎంతో ముఖ్యమని సూర్య అభిప్రాయాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే ఈ జంటను అభిమానులు ఆదర్శ దంపతులుగా ప్రశంసిస్తుంటారు.



'దొంగ నా కొడుకు'గా మౌళీ..

# ఫస్ట్‌లుక్‌తో ఆసక్తి

'90స్ - ఎ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్ సిరీస్‌తో పాటు 'లిటిల్ హార్ట్స్' చిత్రంతో ప్రేక్షకులకు చేరువైన యువ నటుడు మౌళీ ఇప్పుడు మరో వినోదాత్మక చిత్రంతో రానున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'దొంగ నా కొడుకు' అనే టైటిల్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. టైటిల్‌తో పాటు విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'కొన్ని నవ్వులను దోచుకెళ్లేందుకు దొంగ వచ్చేశాడు' అనే భావంతో విడుదల చేసిన పోస్టర్‌ను బట్టి ఇది రాబరీ నేపథ్యంలో సాగే క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్నట్లు తెలుస్తోంది. వినోదంతో పాటు ఉత్కంఠను మేళవిస్తూ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రంలో మౌళీ సరసన సుష్మిత కథానాయికగా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సంగీత హక్కులను థింక్ మ్యూజిక్ సొంతం చేసుకోగా, విదేశీ విడుదలను ప్రత్యంగిరా సినిమాస్ నిర్వహించనుంది. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.వినూత్నమైన టైటిల్‌తోనే అందరి దృష్టిని ఆకర్షించిన 'దొంగ నా కొడుకు' నుంచి మరిన్ని ప్రచార చిత్రాలు, విడుదల తేదీకి సంబంధించిన వివరాలు త్వరలో ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.




# సమంత స్టైల్‌కు ఫిదా!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు సినిమాల్లోనే కాదు, ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. ప్రతి ఫొటోషూట్‌తో కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తూ అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల ఆమె పంచుకున్న తాజా ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఆవాల పసుపు రంగులో రూపొందించిన అందమైన కేప్ శైలి దుస్తుల్లో సమంత ఎంతో హుందాగా, ఆకర్షణీయంగా కనిపించింది. ఈ లుక్‌ను చూసిన అభిమానులు ఆమె అందం, అభిరుచిని ప్రశంసిస్తూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.సమంత ధరించిన ఈ కేప్ దుస్తులు సాంప్రదాయ హుందాతనానికి ఆధునిక ఫ్యాషన్‌ను జోడించినట్లు కనిపిస్తున్నాయి. సింపుల్‌గా కనిపించినా ఎంతో క్లాసీగా, రాజసంగా మెరిసే ఈ దుస్తులు ఆమె వ్యక్తిత్వాన్ని మరింత ప్రత్యేకంగా చూపించాయి. ఈ దుస్తులకు జతగా ధరించిన టర్కాయిస్ రాళ్లతో అలంకరించిన పొడవాటి చెవిపోగులు మొత్తం లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లేత రంగుల మేకప్, సహజమైన ముఖ కాంతి, తక్కువ అలంకరణతో రూపొందించిన హెయిర్‌స్టైల్ ఆమె అందాన్ని మరింత రెట్టింపు చేశాయి. ప్రస్తుతం ఫ్యాషన్ ప్రపంచంలో సింపుల్ అండ్ ఎలిగెంట్ స్టైల్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. అలాంటి ట్రెండ్‌ను సమంత తనదైన శైలిలో మరోసారి ఆవిష్కరించింది. ఎలాంటి ఆర్భాటం లేకుండానే కేవలం సరైన దుస్తులు, ఆభరణాలు, మేకప్‌తో ఎంత అందంగా కనిపించవచ్చో ఆమె నిరూపించింది. అందుకే సమంత ప్రతి కొత్త ఫొటోషూట్ ఫ్యాషన్ ప్రేమికులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండే సమంత తన వ్యక్తిగత స్టైల్‌ను కూడా అదే స్థాయిలో కొనసాగిస్తోంది. ఆమె పోస్ట్ చేసే ప్రతి ఫొటో, ప్రతి లుక్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది మంది అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈసారి కూడా అదే జరిగింది. ఆమె కొత్త లుక్‌పై అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. అటు నటిగా కూడా సమంత తన ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. ఇటీవల గూఢచారి నేపథ్యంలో రూపొందిన వెబ్ సిరీస్‌లో 'హనీ' పాత్రలో యాక్షన్‌తో మెప్పించిన ఆమె, అనంతరం తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పతాకంపై రూపొందిన 'మా ఇంటి బంగారం' చిత్రంలో నటించి మరోసారి తన నటనా ప్రతిభను చాటుకుంది. భావోద్వేగ పాత్రలు, యాక్షన్ కథలు, మహిళా ప్రాధాన్య చిత్రాలు.. ఇలా ప్రతి తరహా పాత్రను సమర్థంగా పోషిస్తూ తనకు తానే సాటి అని నిరూపిస్తోంది. ఒకవైపు కథల ఎంపికలో వైవిధ్యాన్ని చూపిస్తూనే, మరోవైపు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త ప్రమాణాలు సృష్టిస్తున్న సమంత ప్రస్తుతం దేశవ్యాప్తంగా అత్యంత స్టైలిష్ నటీమణుల్లో ఒకరిగా నిలిచింది. ప్రతి కొత్త ఫొటోషూట్‌తో తన అభిమానులకు కొత్త ఫ్యాషన్‌ను పరిచయం చేస్తూ, ప్రతి సినిమాలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ విజయవంతంగా ముందుకు సాగుతోంది. నటిగా, నిర్మాతగా, ఫ్యాషన్ ఐకాన్‌గా సమంత తన ప్రత్యేక స్థానాన్ని మరింత బలపరుచుకుంటూ అందరి ప్రశంసలు అందుకుంటోంది.



# మహేశ్‌తో భారీ సాహసం..

## ఆసక్తికర విషయాలు చెప్పిన రాజమౌళి

సూపర్ స్టార్ మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాపై దర్శకుడు రాజమౌళి తాజాగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఓ అంతర్జాతీయ మాధ్యమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమా పురోగతి, కథ నేపథ్యం, తన ఆలోచనల గురించి వెల్లడించారు. రాజమౌళి మాట్లాడుతూ, చిత్రీకరణ ఇప్పటికే ఎక్కువ భాగం పూర్తయిందని చెప్పారు. ప్రధాన యాక్షన్ సన్నివేశాలు, కీలక ఎపిసోడ్‌ల చిత్రీకరణ పూర్తయిందని, ప్రస్తుతం కొన్ని సన్నివేశాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం చాలా కాలంగా సన్నాహాలు జరుగుతున్నాయని, కథ రూపకల్పనకు కూడా ఎంతో సమయం కేటాయించినట్లు వివరించారు. సినిమా కథకు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే వెల్లడించలేనని చెప్పిన ఆయన, ప్రేక్షకుల్లో ఆసక్తి పెంచేందుకు మాత్రమే కొన్ని అంశాలను పంచుకుంటున్నట్లు తెలిపారు. కథలోని మిస్టరీ, సాహస యాత్ర, భావోద్వేగాలు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తాయని అన్నారు. అందుకే సినిమా గురించి నేరుగా చెప్పకుండా, ప్రత్యేక గ్లింప్స్ రూపంలో పరిచయం చేసినట్లు వెల్లడించారు. ఈ చిత్ర కథ భారతదేశంలోని వారణాసి నుంచి ప్రారంభమై ప్రపంచంలోని పలు ప్రాంతాలకు ప్రయాణిస్తుందని, చారిత్రక, పౌరాణిక అంశాలతో కూడిన సాహస గాథగా రూపొందుతోందని తెలిపారు. విభిన్న కాలాలు, విస్తారమైన ప్రదేశాలను కలిపే కథ కావడంతో ఈ సినిమాను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రేక్షకులకు గొప్ప విజువల్ అనుభూతిని



అందించాలనే లక్ష్యంతో భారీ స్థాయిలో నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు. హాలీవుడ్ సాహస చిత్రాలు తనపై ప్రభావం చూపాయని రాజమౌళి తెలిపారు. ముఖ్యంగా ప్రపంచ సినీ దర్శకుల పనితీరును చిన్నప్పటి నుంచే ఆసక్తిగా గమనించేవాడినని, ఆ అనుభవం తన సినిమాల్లో సహజంగానే ప్రతిబింబిస్తుందని చెప్పారు. ప్రపంచ స్థాయి సాంకేతికతను భారతీయ కథతో మేళవించి కొత్త అనుభూతిని అందించాలన్నదే తన లక్ష్యమని వివరించారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రముఖ బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తుండగా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయాలపై చిత్రబృందం అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది.




# వేగంగా సాగుతున్న 'డ్రాగన్' పనులు



పాన్ ఇండియా చిత్రాల విషయంలో విడుదల తేదీ అనేది కేవలం ఒక ప్రకటన మాత్రమే కాదు. థియేటర్ల ప్రణాళిక, పంపిణీ ఒప్పందాలు, ఓటీటీ హక్కులు, ప్రచార కార్యక్రమాలు, వివిధ భాషల్లో విడుదల వంటి అంశాలన్నీ దానిపైనే ఆధారపడి ఉంటాయి. అందుకే భారీ చిత్రాల నిర్మాణంలో చిన్న జాప్యం కూడా మొత్తం ప్రాజెక్ట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ కథానాయకుడిగా రూపొందుతున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్‌పై ఆసక్తికర చర్చ జరుగుతోంది.ఎన్టీఆర్ భుజానికి గాయం కావడంతో కొద్ది రోజులపాటు విశ్రాంతి తీసుకుంటున్నప్పటికీ, సినిమా చిత్రీకరణ మాత్రం నిలిపివేయలేదని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. హీరో అవసరం లేని సన్నివేశాలు, ఇతర నటీనటులతో కూడిన భాగాలను ముందుగానే పూర్తి చేసేలా చిత్రబృందం ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. దీంతో షూటింగ్‌కు అంతరాయం లేకుండా పనులు కొనసాగుతున్నాయని సమాచారం.భారీ బడ్జెట్ చిత్రాల్లో చిత్రీకరణ నిలిచిపోతే నిర్మాణ వ్యయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది. సెట్ల నిర్వహణ, సాంకేతిక నిపుణులు, ఇతర నటీనటుల తేదీలు, పరికరాల అద్దె వంటి అంశాలు నిర్మాతలకు అదనపు భారం కలిగిస్తాయి. అందుకే ఇలాంటి పరిస్థితుల్లో ముందుగా సిద్ధం చేసిన ప్రత్యామ్నాయ షెడ్యూల్ ప్రకారం షూటింగ్‌ను కొనసాగించడం సాధారణంగా అనుసరించే విధానంగా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.'డ్రాగన్' చిత్ర యూనిట్ కూడా ఇదే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు సమాచారం. ఎన్టీఆర్ తిరిగి చిత్రీకరణలో పాల్గొనేలోపు ఇతర కీలక సన్నివేశాలను పూర్తి చేసి, ఆయన సెట్స్‌లో చేరిన తర్వాత ప్రధాన ఘట్టాలను చిత్రీకరించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. దీంతో సినిమా నిర్మాణ కాలపట్టికపై పెద్దగా ప్రభావం పడకుండా చూసే ప్రయత్నం జరుగుతోందని సమాచారం.ప్రస్తుతం ఈ చిత్రం విడుదల తేదీలో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. అయితే షూటింగ్ షెడ్యూల్, విడుదల తేదీకి సంబంధించిన పూర్తి వివరాలను చిత్రబృందం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. భారీ ప్రాజెక్టులను అనుకోని పరిస్థితుల్లో ఎలా సమర్థంగా నిర్వహించాలో 'డ్రాగన్' చిత్ర యూనిట్ చూపిస్తున్న ప్రణాళిక సినీ పరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com